నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 15-7-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 278 | పేజీలు: 6 | వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

వనదహనం
చెట్ల వికృతి గీతం
దీనంగా లోకం

విశ్వమైదానం
రెక్కలొచ్చినపక్షి
ఆట విడుపు

త్యాగఫలితం
రైతు చిన్నకోరిక
నేలకునేల

విద్యా సుస్వప్నం
జాతి కీర్తి జాబిల్లి
అందితే అందం

గ్రూపులు నాల్గు
ఒకే ఎరుపురంగు
ప్రాణం తీయవు

- రేడియమ్
సెల్: 9291527757

నీనిజాలు

ప్రశ్నించే ఎవరినైన
పలికె కంఠమెత్తి !
మెరుస్తున్న నిప్పులాంటి
మనిషి మహేష్ కత్తి !

ఝుళిపించిన తిరుగుబాటు
కత్తి ధ్వని వినాలి !
ప్రతి వాడూ చేయెత్తి
జిందాబాద్ అనాలి !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్‌లో కాల్పుల కలకలం..

హైదరాబాద్ , జులై 14:నగరంలోని గన్‌ఫౌండ్రీలోని ఎస్‌బీఐ కార్యాలయం ఆవరణలో బుధవారం మధ్యాహ్నం కాల్పులు కలకలం సృష్టించాయి. ఒప్పంద ఉద్యోగి సురేందర్‌పై సెక్యూరిటీ గార్డ్ సర్దార్ ఖాన్ రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. పరస్పర వాగ్వాదంతో సెక్యూరిటీ గార్డ్ విచక్షణ కోల్పోయి కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. కాల్పుల్లో గాయపడ్డ ఒప్పంద ఉద్యోగిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాల్పులకు పాల్పడ్డ సెక్యూరిటీ గార్డును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లోయలో పడిపోయిన ఆర్మీ వాహనం.. జవాన్ మృతి

ఇటానగర్, జులై 14:: అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఎగువ సియాంగ్ జిల్లాలో బుధవారం ఆర్మీ వాహనం ప్రమాదవశాత్తు లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఓ జవాన్ మృతి చెందగా.. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ వాహనంలో 11 మంది ఉండగా.. మిగింగో ట్రాన్సిట్ క్యాంప్ నుంచి ట్యూటింగ్ క్యాంప్‌కు వెళ్తుండగా ఘటన చోటు చేసుకుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. కొండ ప్రాంతంలోని రహదారిపై వెళ్తుండగా పొంగో ? ట్యూటింగ్ మధ్య లోయలో పడిపోయిందని ట్యూటింగ్ అదనపు డిప్యూటీ కమిషనర్ (ఏడీసీ) స్టార్లీ జామోహ్ తెలిపారు.

ప్రమాదంలో నాల్గో సిక్కు లైట్ పదాతిదళ రిజిమెంట్‌కు చెందిన జవాన్ అక్కడికక్కడే మృతి చెందగా.. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారని, వారిని వెంటనే ఆర్మీ ఛాపర్ ద్వారా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. నలుగురిలో ఒకరిని అసోంలోని టిన్సుకియా జిల్లాలోని దింజన్ ఆర్మీ బేస్ ఆసుపత్రిలో చేర్పించగా.. మిగతా ముగ్గురిని గువాహటి ఆర్మీ బేస్ దవాఖానకు తరలించినట్లు చెప్పారు. ఆరుగురు జవాన్లకు స్వల్పంగా గాయాలయ్యాయని, రోడ్డు మార్గంలో వారిని ట్యూటింగ్‌కు పంపినట్లు తెలిపారు.

పారదర్శకంగా కరోనా మరణాల నమోదు : కేంద్రం

న్యూఢిల్లీ, జులై 14: ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిన కరోనా మరణాల కంటే అత్యధికంగా కొవిడ్-19 మరణాలు సంభవించాయని వెల్లడించిన పలు మీడియా కథనాలు అవాస్తవాలని కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. కరోనా మరణాలను పకడ్బందీగా నమోదు చేసే పటిష్ట వ్యవస్థ దేశంలో ఉందని స్పష్టం చేసింది. అధిక మరణాలను చూపేందుకు హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్ఎంఐఎస్), సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) డేటాను పోల్చిన నివేదికలను కేంద్రం తోసిపుచ్చింది.

కారణాలు తెలియని 2,50,000కు పైగా మరణాలను మీడియా కథనాలు కొవిడ్ మరణాలుగా పరిగణించాయని కేంద్రం ఆక్షేపించింది. ఎలాంటి ఆధారాలు లేని ఊహాజనిత మీడియా నివేదికలను వండివార్చారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. కొవిడ్ డేటా నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, కరోనా సంబంధిత మరణాలను నమోదు చేసేందుకు సమర్థ వ్యవస్థ ఇప్పటికే ఉందని స్పష్టం చేసింది. ఈ సిస్టంలో క్రమం తప్పకుండా కరోనా మరణాలను తాజాపరచాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం కోరిందని పేర్కొంది.

ఒక్క ఎకరం కూడా వదలకుండా సాగు : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జులై 14:గత ఏడేండ్ల కాలంలో వ్యవసాయ రంగంలో తెలంగాణ సాధించిన ఘన విజయాలను బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం కేసీఆర్ మంత్రులతో ప్రస్తావించారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు, అనేక కష్టాలకోర్చి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో నదీజలాలను చెరువులకు, కుంటలకు, బీడు భూములకు ప్రభుత్వం మళ్లించిందని సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఒక్క ఎకరం కూడా వదలకుండా, వ్యవసాయానికి అనువుగా ఉన్న భూములను రైతులు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో పెద్దఎత్తున రాష్ట్రంలో వ్యవసాయ సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన బుధవారం ప్రగతి భవన్‌లో రెండో రోజు జరిగిన కేబినెట్ సమావేశంలో వ్యవసాయ శాఖపై చర్చించారు. ఈ సందర్భంగా గత సంవత్సర కాలంలో వ్యవసాయ రంగంలో జరిగిన పురోగతి, ధాన్యం దిగుబడి, సాగు విస్తీర్ణం పెంపు, తదితర విషయాలను వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, ఆ శాఖ అధికారులు కేబినెట్‌కు సమగ్రంగా వివరించారు. వానాకాలం సాగు ప్రారంభమైన నేపథ్యంలో, విత్తనాలు ఎరువుల లభ్యత, వర్షాపాతం తదితర అంశాల పై కేబినెట్ చర్చించింది.

రాష్ట్రంలోని రైతాంగానికి పంట పెట్టుబడి సాయం రైతు బంధు సహా సకాలంలో ఎరువులు, విత్తనాలను అందిస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. వ్యవసాయ, రైతు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇలా అన్ని రకాల చర్యల ఫలితంగా గత సంవత్సరం తెలంగాణలో రికార్డు స్థాయిలో 3 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. గ్రామాల్లోకి వెళ్లి ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేసిందని సీఎం కేసీఆర్ గుర్తు చేశారు.

ధాన్యం ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం

ఈ నేపథ్యంలో.. తెలంగాణ రైతులు మరింత ఉత్సాహంతో పరిధాన్యాన్ని పండించే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని, వచ్చే సంవత్సరం ధాన్యం ఉత్పత్తి మరింతగా పెరిగే అవకాశాలున్నాయని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా ధాన్యం నిలువ చేయడం, మార్కెటింగ్ చేయడం పై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుత వానాకాలం కోటీ నలభై లక్షల ఎకరాల్లో వ్యవసాయ సాగు జరగనున్నదని, వరి పత్తి పంటలు రికార్డుస్థాయిలో పండనున్నాయని సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో వున్న ధాన్యం నిల్వ సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవాల న్నారు. రైస్ మిల్లులలో మిల్లింగ్ సామర్థ్యాన్ని పెంచుకోవాలని, నూతనంగా రైస్ మిల్లులు, పారబాయిల్డ్ మిల్లులను గణనీయంగా స్థాపించాలన్నారు. ఇందుకు సంబంధించి అత్యంత క్రియాశీలకంగా చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖను సీఎం ఆదేశించారు.

రైతులకు సమగ్రంగా శిక్షణ

రైతులకు సమగ్రంగా శిక్షణ ఇవ్వడానికి కావాలసిన అన్ని సౌకర్యాలను వ్యవసాయ శాఖ కల్పించాలని, ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగాలని సీఎం స్పష్టం చేశారు. ఉద్యానవన శాఖను పూర్తిస్థాయిలో క్రియాశీలకంగా మార్చాలని, అందుకు అవసరమైన రీతిలో అధికారులను, నిపుణులను జోడించి నిరంతరంగా రైతులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ సహా వ్యవసాయ శాఖలో ఎటువంటి ఉద్యోగాలు ఖాళీలు ఉండకూడదని, అన్ని పోస్టులను నింపుకోవాలని కేబినెట్ ఆదేశించింది. పండిన ధాన్యాన్ని పండినట్టే ఫుడ్ ప్రాసెసింగ్‌లో భాగంగా మిల్లింగ్ చేసి ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడికి సరఫరా చేయాలని ఆదేశించింది. ఈ దిశగా అన్ని చర్యలు తీసుకోవాలని కేబినెట్ ఆదేశించింది. అందుకు అవసరమైతే సంబంధిత రంగంలో నిపుణుల సలహాలు సూచనలు తీసుకోవాలని కేబినెట్ సూచించింది. నూతనంగా ముందుకు వచ్చే అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని మంత్రి మండలి అధికారులను ఆదేశించింది.

కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి పెరుగనున్ననేపథ్యంలో.. ధాన్యం నిల్వ, మిల్లింగ్, మార్కెటింగ్ సహా నూతన పరిశ్రమల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఈ సబ్ కమిటీలో సభ్యులుగా మంత్రి గంగుల కమలాకర్, హరీశ్ రావు, కేటీఆర్, ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి సభ్యులుగా ఉంటారు.

హుజురాబాద్ ఉపఎన్నికపై గులాబీ వ్యూహరచన

హైదరాబాద్ , జులై 14:హుజురాబాద్ ఉపఎన్నికపై అధికార టీఆర్ఎస్ పార్టీ దృష్టి సారించింది.

ఉపఎన్నికతోపాటు రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై చర్చించడమే ప్రధాన అజెండాగా టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శులతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్? తెలంగాణ భవన్ లో సమావేశయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత నిర్మాణంపై చర్చించారు. పార్టీ సభ్యత్వ నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియ, పార్టీ జిల్లా కార్యాలయాల నిర్మాణ పురోగతి, కార్యకర్తల జీవిత బీమా వంటి అంశాలపై చర్చిస్తున్నారు. కృష్ణానదిపై ఏపీ ప్రాజెక్టుల నిర్మాణం, రాష్ట్రంలోని రాజకీయ పక్షాల వైఖరి, విపక్షాల విమర్శలకు దీటుగా స్పందించడం, వాటిని ఎదుర్కొనే వ్యూహాలపై సమాలోచనలు చేయనున్నారు. హుజూరాబాద్ ఉపఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని? విజయమే లక్ష్యంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రధాన కార్యదర్శులు, నేతలకు ఉపఎన్నిక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి.

నందిగ్రామ్ పోలింగ్ ఈవీఎంలు భద్రపరచాలని ఈసీకి హైకోర్టు ఆదేశం

కోల్‌కతా, జులై 14:: పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్ పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎంలు, పత్రాలు, వీడియోలను భద్రపరచాలని ఎన్నికల కమిషన్(ఈసీ)ని కలకత్తా హైకోర్టు ఆదే శించింది.

ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో నంది గ్రామ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సీఎం సీఎం మమతా బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన సువెందు అధికారిపై రెండు వేల కన్నా తక్కువ ఓట్లతో ఓడిపో యారు. తిరిగి లెక్కించాలన్న మమత విజ్ఞప్తిని ఈసీ తిరస్కరిం చింది. ఈ నేపథ్యంలో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. మమత పిటిషన్‌పై న్యాయమూర్తి షాంపా సర్కార్ బుధవారం ఆన్‌లైన్ ద్వారా విచారణ జరిపారు. ఆన్‌లైన్ విచారణలో పాల్గొన్న మమ తా బెనర్జీ, పోలింగ్ కేంద్రాల ఆక్రమణ, రిగ్గింగ్, డబ్బుల పంపిణీ, ఓట్ల కోసం ద్వేషం, శత్రుత్వాన్ని పెంపొందించడం వంటి అవి నీతి పద్ధతులకు పాల్పడ్డారని సువెందుపై ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో నందిగ్రామ్ పోలింగ్‌కు సంబంధించిన ఈవీ ఎంలు, పత్రాలు, వీడియోలను భద్రపరచాలని ఆదేశిస్తూ ఎన్నికల కమిషన్, రిటర్నింగ్ అధికారితోపాటు సువెందు అధికారికి కూడా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్ట్ 12కు వాయిదా వేసింది.

కరెంట్ షాక్‌తో యువకుడు మృతి

మేడ్చల్ మల్కాజిగిరి, జులై 14: : ప్రమాదవశాత్తు కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శామీర్‌పేట మండలంలోని తూముకుంటకు చెందిన సునీల్‌కుమార్(22) మేడ్చల్ మండలంలోని దేవరాయంజల్‌లో పాన్‌షాప్‌లో వర్కర్‌గా పని చేస్తున్నాడు. రోజువారి పనిలో భాగంగా మంగళవారం రాత్రి షాపు మూసే సమయంలో పాన్‌షాప్ డబ్బాపై ఉన్న సామన్లను తీసేందుకు ప్రయత్నిస్తుండగా.. ప్రమాదవశత్తు విద్యుత్ తీగ తగలడంతో కరెంటు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. సునీల్‌కుమార్ బావ అమర్‌నాథ్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

నల్లగొండ, జులై 14:: బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో ఎవరికి ఇబ్బంది కలిగించకుండా జరుపుకోవాలని డీఐజీ ఏవీ రంగనాథ్ కోరారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ముస్లిం పెద్దలు, హిందూ సంస్థల ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బక్రీద్ పర్వదినోత్సవ సందర్భంగా పశువుల తరలింపు విషయంలో అన్ని రకాల అనుమతులు, నిబంధనలు పాటించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పశువుల తరలింపులో వెటర్నరీ శాఖ అధికారులు ధృవీకరించిన తర్వాత అనుమతిస్తామని చెప్పారు. గోవుల తరలింపుపై నిషేధం ఉన్న క్రమంలో నిబంధనలు పాటించకుండా గోవులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులతో సహకరించాలని సూచించారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులపై, వారి కదలికలపై నిఘా పెట్టామన్నారు. సమావేశంలో గోలి మధుసూదన్ రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, హఫీజ్ ఖాన్, ముంతాజ్ అలీ, ఎన్.బి. డిఎస్పీ రమణా రెడ్డి, నల్లగొండ వన్ టౌన్, టూ టౌన్ సీఐ బాలగోపాల్, చంద్రశేఖర్ రెడ్డి, టూ టౌన్ ఎస్.ఐ. నర్సింహులు, శాంతి సంఘం సభ్యులు తదితరులున్నారు.

గుడ్ న్యూస్.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు

న్యూఢిల్లీ, జులై 14: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర మంత్రివర్గం శుభవార్త వినిపించింది. గత ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (ఆం) పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు. ఏడో వేతన సవరణ సంఘం సిఫారసుల మేరకు డీఏను 17 శాతం నుంచి 28 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ పెంచిన డీఏ 2021, జులై 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. డీఏ కోసం గత కొద్ది నెలల నుంచి ఎదురుచూస్తున్న లక్షలాది మంది ఉద్యోగులకు కేంద్రం నిర్ణయం ఎంతో ఊరటనిచ్చింది.

రాష్ట్రంలో ఆయిల్ పామ్ రైతులకు పెట్టుబడి ప్రోత్సాహకం

హైదరాబాద్ , జులై 14:రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన బుధవారం ప్రగతి భవన్‌లో రెండో రోజు జరిగిన కేబినెట్ సమావేశంలో వ్యవసాయ శాఖపై చర్చించారు. 2022 ? 23 ఏడాదికి 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టే దిశగా రైతులను చైతన్యపరిచి ప్రోత్సహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. ఇందులో భాగంగా.. ఆయిల్ పామ్ సాగుచేసే రైతులకు ఎకరాకు, మొదటి సంవత్సరం రూ. 26,000, రెండో సంవత్సరం ఎకరాకు రూ. 5,000 మూడో సంవత్సరం ఎకరాకు రూ. 5,000 చొప్పున పంట పెట్టుబడి ప్రోత్సాహకం కింద సబ్సిడీగా అందించాలని నిర్ణయించింది.

ఇందులో భాగంగా అటవీ శాఖ, అటవీ అభివృద్ధి కార్పోరేషన్‌తో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయంతో ఆయిల్ పామ్ మొక్కల నర్సరీలను పెంచాలని కేబినెట్ సూచిం చింది. ఆయిల్ పామ్ పంట విధానం గురించి మరింతగా తెలుసుకోవడానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కూడిన అధ్యయన బృందం.. కోస్టారికా, మలేషియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా తదితర దేశాలలో పర్యటించాలని కేబినెట్ ఆదేశించింది.

ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్లకు, తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూయర్ అడ్వాన్స్‌మెంట్ (టీఐడీఈఏ), తెలంగాణ స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల (టీఎస్ఎఫ్‌పీజెడ్) నిబంధనల ప్రకారం ప్రోత్సాహకాలు అందించాలని అధికారులకు కేబినెట్ సూచించింది.

ఈటల రాజేందర్‌ది ఆత్మ వంచన : కేటీఆర్

హైదరాబాద్ , జులై 14: మాజీ మంత్రి ఈటల రాజేందర్ వ్యవహారంపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తొలిసారి స్పందించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ చేశారు.

ఈటల రాజేందర్‌ది ఆత్మగౌరవం కాదు.. ఆత్మవంచన అని పేర్కొన్నారు. ఈటల తనతో పాటు.. ప్రజలను కూడా మోసం చేస్తున్నారు. ఈటలకు టీఆర్ఎస్ పార్టీ ఎంత గౌరవమిచ్చిందో ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఆయనకు టీఆర్ఎస్ పార్టీలో జరిగిన అన్యాయం ఏంటో చెప్పాలి. మంత్రిగా ఉండి కేబినెట్ నిర్ణయాలను తప్పుబట్టారు. ఈటల చేసిన తప్పును తానే ఒప్పుకున్నారు. ఈటలపై అనామకుడు లేఖ రాస్తే సీఎం చర్యలు తీసుకోలేదు అని కేటీఆర్ తెలిపారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి : డీజీపీ మహేందర్ రెడ్డి

హైదరాబాద్ , జులై 14:మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని, వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కరోనాతో బాధపడుతున్న మావోయిస్టులు లొంగిపోతే.. ప్రభుత్వ పరంగా మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీలో 25 మంది ఉంటే.. తెలంగాణ నుంచి 11 మంది, ఏపీ నుంచి ముగ్గురు ఉన్నారు. వీరంతా వెంటనే లొంగిపోవాలని, కొవిడ్ బారిన పడకుండా రక్షించుకోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. ఇవాళ లొంగిపోయిన మావోయిస్టు నేత, ప్లాటూన్ పార్టీ కమిటీ మెంబర్ రావుల రంజిత్‌ను పోలీసులు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా మద్దూరు మండలానికి చెందిన రావుల శ్రీనివాస్ అలియాస్ రామన్న, సావిత్రి దంపతుల కుమారుడు రావుల రంజిత్ అని తెలిపారు. రామన్న, సావిత్రి ఇద్దరూ మావోయిస్టులే. ఈ దంపతులకు 1998లో రంజిత్ జన్మించాడు. దీంతో రంజిత్ బాల్యమంతా దళాలతోనే సరిపోయింది. 1 నుంచి 6వ తరగతి వరకు జనతన సర్కార్ పాఠశాలల్లో చదివాడు. ఈ క్రమంలో చిన్నప్పటి నుంచే మావోయిస్టు కార్యకలాపాల్లో రంజిత్ చురుకుగా పాల్గొన్నాడు.

రహస్యంగా పదో తరగతి వరకు

తన కుమారుడిని ఉన్నత చదువులు చదివించాలనే ఉద్దేశంతో రంజిత్‌ను రహస్యంగా పదో తరగతి వరకు చదివించాడు. మావోయిస్టు నగేశ్ సహకారంతో నిజామాబాద్ జిల్లాలోని కాకతీయ స్కూల్లో చేర్పించాడు. ప్రతి సమ్మర్ వెకేషన్‌లో దండకారణ్యంలో ఉంటున్న తండ్రి రామన్న వద్దకు రంజిత్ వచ్చేవాడు. 2015లో రంజిత్ పదో తరగతి పూర్తి చేశాడు. ఆ సమయంలోనే నగేశ్ చనిపోయాడు. దీంతో రంజిత్‌ను ఉన్నత విద్య చదివించేందుకు పంపలేదు. తమ కార్యకలాపాలు బయటకు తెలుస్తాయనే భయంతో రంజిత్ చదువును అక్కడితో ఆపేశాడు.

తండ్రి మరణించిన తర్వాత వేధింపులు

ఇక రంజిత్ 2015 నుంచి 2017 వరకు మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పని చేశాడు. తండ్రి సూచనల మేరకు 2017లో మావోయిస్టు బెటాలియన్‌లో రంజిత్ చేరాడు. 2019లో తండ్రి రామన్న తీవ్ర అనారోగ్యానికి గురై గుండెపోటుతో చనిపోయాడు. బయటకు తీసుకెళ్లి మెరుగైన వైద్యం చేపిద్దామని చెప్పినా కూడా పార్టీ రంజిత్ వాదనను వినిపించుకోలేదు. ఇక తండ్రి మరణానంతరం రంజిత్‌కు పార్టీలో వేధింపులు ఎక్కువ అయ్యాయి. ఈ క్రమంలో మావోయిస్టు కార్యక్రమాలపై విరక్తి చెందిన రంజిత్ లొంగుబాటుకు అనుమతి అడిగాడు. కానీ మావోయిస్టు పార్టీ తిరస్కరించింది. దీంతో దండకారణ్యంలో పార్టీలో చురుకుగా పాల్గొంటున్న తన తల్లి సావిత్రి వద్దకు రంజిత్ వెళ్లి తన లొంగుబాటు విషయాన్ని చెప్పాడు. మొత్తానికి తల్లి అనుమతితో రంజిత్ లొంగిపోయాడు. మావోయిస్టు భావజాలంతో ప్రస్తుతం ఎలా ంటి ఉపయోగం లేదని రంజిత్ అభిప్రా యపడాడు. మిగిలిన మావోయిస్టులు కూడా లొంగిపోవాలని రంజిత్ విజ్ఞప్తి చేశాడు. రంజిత్ అవగాహన ప్రకారం ప్రతి నెల ఐదారుగురు చేరుతారు.. ఐదారుగురు పారి పోతారు అని రంజిత్ చెప్పినట్లు డీజీపీ వెల్లడించారు.

రూ. 4 లక్షల చెక్కు అందజేత

రంజిత్‌పై ఉన్న రివార్డు చెక్కు(రూ. 4 లక్షలు)ను అతనికి డీజీపీ మహేందర్ రెడ్డి అందజేశారు. తక్షణ అవసరాల నిమిత్తం రూ. 5 వేల నగదును కూడా అందజేశారు డీజీపీ.

పంజాబ్ కాంగ్రెస్ చీఫ్‌గా నవజ్యోత్ సింగ్ సిద్ధూ!

న్యూఢిల్లీ, జులై 14: పంజాబ్ కాంగ్రెస్‌లో వర్గపోరుకు చెక్ పెట్టేందుకు సిద్ధమైన పార్టీ అగ్రనాయకత్వం సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్‌తో విభేదిస్తున్న అసంతృప్త నేత, పార్టీ ఎమ్మెల్యే నవజ్యోత్ సింగ్ సిద్ధూకు కాంగ్రెస్ రాష్ట్ర శాఖ చీఫ్ పదవిని కట్టబెట్టాలని యోచిస్తోంది. పంజాబ్ కాంగ్రెస్‌లో కీలక పదవి ఇవ్వడం ద్వారా సిద్ధూని సంతృప్తి పరచాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. సిద్ధూ ఇప్పటికే పార్టీ అగ్రనేతలతో భేటీ కావడంతో పాటు విపక్ష ఆప్ తన సామర్థ్యం, విజన్‌ను మెచ్చుకుంటోందని ఇటీవల ట్వీట్ చేయడంతో రెబెల్ నేతను బుజ్జగించేందుకు పార్టీ హైకమాండ్ సన్నద్ధమైంది.

ఆటా, టాంటెక్స్ సంస్థల ప్రతినిధులకు

ఇట్‌క్లా- సినారె పురస్కారాల ప్రదానం

లక్ష్మి పాలేటి

శారద సింగిరెడ్డి

హైదరాబాద్, జులై 14: ఆటా బోర్డ్ ఆఫ్ ట్రస్టీ శారద సింగిరెడ్డి, టాంటెక్స్ అధ్యక్షుడు లక్ష్మి పాలేటికి ఇట్‌క్లా-సినారె-2021 పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఇట్‌క్లా అధ్యక్షుడు, చైర్మన్ డాక్టర్ కె.ధర్మారావు, విజయ్‌కుమార్, తెలిపారు. జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి 90వ జయంతి సందర్భంగా ఈనెల 17న అంతర్జాలం వేదికగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ శ్రీ కటుడై, సద్గుణ శ
ఆత్మ కటుడై సేవలడిన నాయకుడతన
'కొకా సుబ్బారావు'ను
లోకుడు త్రోచి యెసగె రుచిరపు బిరుదన్ !!

(జులై 15 మాజీ నీజెబ కోకా సుబ్బారావు జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210

తెలంగాణ రచయితల సంఘం జంటనగరాలు
తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం

సంయుక్త ఆధ్వర్యంలో

గజవెల్లి దశరథరామయ్య గారి అక్షర గులకలు
గేయ కవితా సంపుటి

ఆవిష్కరణ సభ

తేది : 20-7-2021 సా॥ 5 గం॥లకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం TPSK షోయబ్‌హాల్

అధ్యక్షులు : శ్రీ కందుకూరి శ్రీరాములు
అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు

ముఖ్య అతిథి : డా॥ నందిని సిధారెడ్డి
తొలి పూర్వ అధ్యక్షులు,తెలంగాణ సాహిత్య అకాడమీ

అంకితం : శ్రీ అశ్వాపురం వేణుమాధవ్
అధ్యక్షులు, తెలంగాణ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం

విశిష

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 15-7-2021

నేటికవిత-కవిత్వ విశ్లేషణ

-శ్రీదాస్యం లక్ష్మయ్య
జర్నలిస్ట్, నేటినిజం
9440155240

నేటికవితలో ఈ వారం: **'అల్లుకుపోయిన ఆశాలతలు'** అనే అంశంపై వచ్చిన 52 కవితల సమీక్షలో అత్యుత్తమంగా నిలిచిన కవితల్లోంచి ఓ మూడు ఎంపికయిన కవితలపై విశ్లేషణ

-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

జ్ఞాపకాల పూలు

ఆలోచనల తీవెలు అల్లుకుంటున్నాయి
ఒకదానికొకటి జతచేసుకుంటూ
జ్ఞాపకాల పూలను వికసింపజేస్తూ
హృదయమంతా పరుచుకుంటూ.
అల్లుకుపోయిన ఆశాలతల మధ్య
వడలిన కుసుమమై ఓ స్నేహం
వెడలిన విషాదకాలానికి గుర్తుగా
మనసు తోటలో మిగిలిపోయింది.
తీగవీడినా రాలిపోయి గతమైనా
సుగుణాల సౌరభాలను మాత్రం
మనసులో ఇంకా వెదజల్లుతోంది
తనువు మాయమైనా తడిమే తలపై.
మది వనాన పదిలమై నిలిచిపోయింది
అంతేమరి.. కొన్ని వీడిపోని బంధాలు
తీగలై పెనవేసుకుని జన్మంతా వీవనంటు
తామున్నా లేకున్నా గతస్మృతులుగా
మనల్ని నిరంతరం పలకరిస్తాయి.
గెలుపులో.. ఓటమిలో ఉనికిని చూపి
కన్నీటిజల్లె కురిసాక మాయమవుతాయి

-అనూశ్రీ
9666688370

గోదావరిఖనికి చెందిన కవయిత్రి గౌరోజు అనూశ్రీ గారు అల్లుకుపోయిన ఆశాలతలు అంశంపై జ్ఞాపకాల పూలు శీర్షికతో రాసిన కవితలో కొన్ని జ్ఞాపకాలు మనల్ని నిరంతరం పరామర్శిస్తుంటాయన్న అర్థం ధ్వనించేలా తమ భావాలను అక్షరాలలో నిక్షిప్తం చేశారు. గెలుపులోనే కాదు ఓటమిలోనూ తమ ఉనికిని చాటి కన్నీటి జల్లె కురిసాక జ్ఞాపకాలు మాయమవుతాయని వివరించారు. ఎత్తుగడలోనే ఆలోచనల తీవెలు అల్లుకుంటున్నాయి ఒకదానికొకటి జతచేసుకుంటూ అని ప్రారంభించడం బావుంది. అల్లుకున్న ఆలోచనల లతలు జ్ఞాపకాలపూలను వికసింపజేస్తూ హృదయాన్నంతటినీ పరుచుకుంటాయన్న అనుభవాన్ని అందంగా ఆవిష్కరించారు.

అల్లుకుపోయిన ఆశాలతల మధ్య వడలిన కుసుమమై ఓ స్నేహం.. వెడలిన విషాద కాలానికి గుర్తుగా మనసుతోటలో మిగిలిపోయిందని చక్కని భావుకతతో కవితావస్తువుకు పుష్టిని కలిగించారు. మనసు తోటలో విషాదకాలానికి గుర్తుగా ఓ స్నేహం మిగిలిపోయిందని చెప్పడం బావుంది. తీగ వీడినా.. రాలిపోయి గతమైనా.. సుగుణాల సౌరభాలను మాత్రం మనసులో ఇంకా వెదజల్లుతోందని ప్రకటించడంలోనే కవయిత్రి రచనా వైచిత్రిని ప్రశంసించి తీరుతాం. తనువు మాయమైనా తడిమే తలపై సుగుణాల సౌరభాలు వెదజల్లుతున్నాయని చెప్పడం బావుంది. తీగవీడినా రాలిపోయిన గతమైనా పదబంధ ప్రయోగం చేసి కవయిత్రి తమ భావుకతను చాటుకున్నారు.

కొన్ని వీడిపోని బంధాలు..తీగలై పెనవేసుకుని జన్మంత వీడనంటూ... తామున్నా లేకున్నా గతస్మృతులుగా మనల్ని సదా పలకరిస్తాయన్న వాస్తవాన్ని చక్కగా ఆవిష్కరించారు. జ్ఞాపకాల పూల సౌరభాలను గుబాళింపజేసేందుకు కవయిత్రి ఎంచుకున్న పదబంధాలు కవితలో ఇట్టే ఒదిగిపోయాయి. కవితకు శోభను కూర్చాయి. ముగింపులో జ్ఞాపకాలగురించి ప్రస్తావించిన తీరు బాగుంది. గెలుపులో ఓటమిలో ఉనికిని చూపి కన్నీటి జల్లె కురిసాక మాయమవుతాయని వివరించారు. గెలుపులో సంతోషాన్ని, ఓటమిలో బాధను ప్రకటించడానికి కన్నీటి జల్లులు పరామర్శిస్తాయని నర్మగర్భంగా చెప్పారు. మున్ముందు అభివ్యక్తి, శిల్పం వంటి విషయాలలో కవయిత్రి అనూశ్రీ గారు మరింత శ్రద్ధ చూపగలరని విశ్వసిద్దాం.

హద్దులు దాటని ఆశలు

మానవతా విలువలు
మబ్బుల చాటుకు వెళ్ళిన శశిలా
అమావాస్య చీకట్లో
మాయమైపోతున్న మనిషి
వెలుగుల వలువలు పెంచుకొనేదెప్పుడో!!
రేపటికి రూపం లేదని
కలలు కంటూనే
అత్యాశలతో అల్లుకుపోయిన
లతల్లా గాలిలో మేడలు కడుతూ
దారంలేని గాలిపటాల్లా
ఎప్పుడు నిరాశల ఊబిలో
కూరుకుపోతారు!!
మనసులో ఒకటి చేతల్లో మరొకటి
అజ్ఞానాన్ని కప్పిపుచ్చేందుకు
అబద్దాల గొలుసులతో
చక్కని కథలల్లడం పరిపాటి
హద్దులు దాటని ఆశలు
అందరికీ మంచిది!!.
పందిరి ఆధారంలా
ఆత్మవిశ్వాసంతో స్వశక్తిపై
మనిషి కృషితో నడిస్తే
లతల్లా అవకాశాలు ఎదురొచ్చి
అదృష్టాన్నే మార్చివేయవా!!.

-మద్దెల సరోజన
9908352377

జగిత్యాలకు చెందిన కవయిత్రి మద్దెల సరోజన గారు అల్లుకుపోయిన ఆశాలతలు అంశంపై హద్దులు దాటని ఆశలు శీర్షికతో రాసిన కవితలో స్వశక్తితో నిలవాలని, స్వయంకృషితో అడుగులు వేయాలని ఆత్మవిశ్వాసమే ఆలంబనగా విజయతీరాలు చేరాలన్న అర్థం వచ్చేలా తమ భావాలను అక్షరాలలో బంధించారు. మానవతా విలువలు మృగ్యమై పోతున్నాయన్న సంగతిని మబ్బుల చాటుకు వెళ్లిన శశితో పోల్చారు. అమావాస్య చీకటిలో మాయమైపోతున్న మనిషిని ప్రస్తావిస్తూ వెలుగుల విలువలు పెంచుకునేదెప్పుడో? అంటూ కవితాత్మకంగా ప్రశ్నించారు.

రేపటికి రూపంలేదని కలలు కంటూనే అత్యాశలతో అల్లుకుపోయిన లతల్లా గాలిలో మేడలు కడుతూ దారం లేని గాలిపటాల్లా ఎప్పుడూ నిరాశల ఊబిలో కూరుకుపోతారని కొనసాగించారు. దారం లేని గాలిపటాల్లా అన్న తరువాత ఇంకా బలంగా చెప్పటం కోసం ఎప్పుడూ నిరాశల ఊబిలో కూరుకుపోతారని పద ప్రయోగం చేశారు. నర్మగర్భంగా అత్యాశలు వద్దన్న సందేశాన్ని అందించే ప్రయత్నం చేశారు. ఎప్పుడూ నిరాశల ఊబిలో కూరుకు పోరాదని, గాలిలో మేడలు కట్టవద్దని హితవు పలికారు.

అజ్ఞానాన్ని కప్పిపుచ్చేందుకు అబద్దాల గొలుసులతో కథలు అల్లవద్దని.. మనసులో చేతల్లో ఒకటే ఉండాలనీ , హద్దులు దాటని ఆశలు అందరికీ మంచిదన్న సందేశాన్ని అందించారు. అబద్దాల గొలుసులు పదబంధ ప్రయోగం చేయడంలో కవయిత్రి ఔచిత్యం బోధపడకపోయినప్పటికీ బంగారు గొలుసును దృష్టిలో పెట్టుకుని కవితలో గొలుసుపదం రాసి ఉంటారని పాఠకులుగా మనం కొంత మేరకు స్పష్టతకు రాగలం.

పందిరి ఆధారంలా స్వయంకృషి.. స్వశక్తిపై ఆత్మవిశ్వాసమే ఆలంబనగా కొనసాగినట్లయితే.. విజయాలు వాటికవే సమకూరగలవన్న అర్థం ధ్వనించేలా కవయిత్రి సరోజన గారు తమ భావాలను పొందుపరిచారు. మనిషి స్వయంకృషిని నమ్ముకుంటే లతల్లా అవకాశాలు ఎదురొచ్చి అల్లుకుపోతాయని, జీవితాలనే మార్చేస్తుందని పేర్కొన్నారు. కవయిత్రి సరోజన గారు మున్ముందు తమ కలానికి పదునుపెట్టుకునేందుకు అధ్యయనంపై దృష్టి పెట్టాలని కోరుకుందాం.

అంకితం

పెరటిలో సుమాలు
ముగ్ధమోహనంగా
పవనుడితో కలిసి నాట్యం చేస్తున్నాయి
వృక్షాలను అల్లుకుపోయిన లతలు
ఎందుకో కాస్త నీరసంగా
వాలిపోయినాయి
నేడు ప్రతి హృది దస్సిపోయినట్లు..!.
దాహార్తినితీర్చి ..ఉత్సాహఊపిరులు
అందించితేనేగాని తేరుకోలేకపోయాయి
ఆశల పందిరి వేసుకుంటేనే కదా
ప్రతి మొక్కను పరికించి చూస్తే
అవగతమవుతుంది జీవితసారం
కదిలించితే చెబుతాయి జీవనవేదం
వాటి జీవితమంతా
పరులసేవకే అంకితమిచ్చినా
ఎప్పుడు పచ్చగా పలకరిస్తూనే ఉంటాయి
హృదయ విశాలతత్త్వం బోధపరుస్తూ..!.
మనిషి మాత్రం నిత్యం నిష్ఠూరాలు
నిందలు, అసూయాద్వేషాలతో
రగులుకుపోతూనే ఉంటాడు
తుదిశ్వాస విడిచేవరకు..!

-రాధాకుసుమ
9989241319

హైదరాబాదుకు చెందిన కవయిత్రి రాధాకుసుమ గారు అల్లుకుపోయిన ఆశాలతలు అంశంపై అంకితం శీర్షికతో రాసిన కవితలో మొక్కల్లో ఉండే విశాల భావన మనిషిలో కొరవడుతోందని, మానవీయ ఆశల పందిరి వేసుకుంటేనే కదా మనసుకైనా మల్లెతీగకైనా అందం ఆనందమని, అది లేనినాడు జీవితం నిస్సారమని తేల్చి చెప్పారు. ఎత్తుగడలో కవయిత్రి రాధాకుసుమ గారు పెరటిలో సుమాలు ముగ్ధ మనోహరంగా పవనుడితో కలిసి నాట్యం చేస్తాన్నాయని తమ భావుకతను చాటుకున్నారు. వృక్షాలను అల్లుకుపోయిన లతలు ఎందుకో కాస్తా నీరసంగా వాలిపోయాయని పేర్కొనడానికి నేడు ప్రతి హృది సొలసిపోయినట్లని వర్ణించారు. అవి తేరుకోవాలంటే దాహార్తిని తీర్చి తిరిగి ఉత్సాహ ఊపిరులు అందించాలని సూచించారు.

ఆశలపందిరి వేసుకుంటేనే కదా మనసుకైనా.. మల్లెతీగకైనా ఆనందమని, అది లేనినాడు జీవితం నిస్సారమని పేర్కొన్నారు. మానవీయత ప్రతిబింబించేలా మానవత్వమే ఆలంబనగా ఆశల పందిరి వేసుకొని జీవితాన్ని ఆనందమయంగా మలచుకోవాలన్న సందేశాన్ని నర్మగర్భంగా అందించడంలో కవయిత్రి సఫలీకృతులైనారు. ప్రతి మొక్కను పరికించి చూస్తే జీవితసారం అవగతమౌతుంది,,, కదిలించి చూస్తే జీవనవేదాన్ని ప్రబోధిస్తాయని తెలిపిన తీరు బాగుంది.

మొక్కల జీవితమంతా పరులసేవకే అంకితమైనా ఎప్పుడూ పచ్చగా పలకరిస్తాయని.. త్యాగంతో పరులకోసమే అంకితమైన వాటి హృదయం విశాలమైందని బోధపడుతుందని వివరించారు. మనుష్యులం మనం.. మొక్కలనుండి విశాల హృదయతత్వాన్ని అలవరచుకోవాలన్న సందేశాన్ని అందించారు. మనిషి ఇకనైనా నిత్యం నిందలు నిష్ఠూరాలు మారాలని అసూయాద్వేషాలతో కడదాకా రగిలిపోకుండా కాస్తంతైనా మొక్కలను చూసి సహృదయతను పాటించాలని హితవుపలికారు.

మానవీయ విలువలకు చోటు కల్పిస్తూ పరోపకారమే లక్ష్యంగా కొంతమేరకైనా ప్రకృతిలా మనుష్యులుగా మనం కూడా వ్యవహరించాలని ఆకాంక్షించడం బాగుంది. మున్ముందు కవయిత్రి రాధాకుసుమ గారి కలంనుండి మరిన్ని మంచి కవితలు జాలువారాలని కోరుకుందాం. వస్తువిశ్లేషణలో , అభివ్యక్తితో.. మరింత నవ్యతను పాటిస్తారని ఆశిద్దాం.

భల్లం భాష్యం

మంచి కవిత్వం కోసం మరోసారి బెంగపడ్డప్పుడు...

కవిత్వం- పచ్చని కొమ్మమీంచి వెచ్చగా ఆకాశంవైపు చూసే పక్షి రెక్కమీద నిశ్శబ్దంగా వాలిన వాన చినుకల్లే ఉండాలేమో. కవిత్వమయినా, జీవితమయినా ఎంత చదివాం అన్నది కాదు, ఎంత అర్థం చేసుకున్నాం అన్నది ముఖ్యం. కవిత్వంలో విధేయతతో, బాధ్యతతో కండ్లలో వొత్తు లేసుకున్న మెలకువతో ప్రయోజకత్వంతో ఉత్తమ కవి ముందుకు అడుగులు వేస్తుంటాడు.

కవి నిరంకుశుడు అంటారు కానీ అది ఎల్లవేళలా నిజం కాదేమో. కవి వాస్తవిక వాది. నిజాన్ని నిలదీసి, నిగ్గదీసి, నిగ్గుతీయగల స్వభావి. అందుకే నిమ్మదిగా చెప్పినా, నిలదీసినట్టు చెప్పినా కవికే చెల్లుతుంది.

కవిత్వం అనేది సాధారణంగా సమకాలీన సమాజం స్థితిగతులు, ఆచారాలు, వ్యక్తుల మనస్తత్వ చిత్రణలు మూలవస్తువులుగా రూపొందుతుంది. కవి తన దృక్పథంలో ఆనాటి సామాజిక పరిస్థితిని అక్షరబద్ధం చేస్తుంటాడు.

కవి తన ఆలోచనలను ఒక "ఇజం"కు పరిమితం చెయ్యకుండా కవిత్వం రాసుకుంటూ వచ్చినా, కొత్త ఒరవడికి స్పందన లేని వారెవరూ కలం పట్టుకోడానికి అర్హులు కారేమో. అన్న అభిప్రాయానికే, అభిమతానికే లోబడి కొంత గాలివాటు ధోరణులకు అపుడపుడూ మొగ్గు చూపుతున్నట్లు కనబడుతుంది.

కవిత్వం బ్లాక్ అండ్ వైట్ కాదు. అలాగని సప్తవర్ణ సమ్మిశ్రితం కూడా కాదు. అన్ని రంగుల్లో అద్భుతమైన "షేడ్స్"తో అపూర్వంగా అలరారుతూ అనుక్షణం అలరిస్తూ ఉంటుంది. కవిత్వంలో ఇప్పుడు వ్యక్తీకరణ భాష- మాండలికం, వాక్య నిర్మాణంతో సహా సాహిత్య మూల రూపాలన్నీ కొత్త పునాది కోసం వెతుక్కుంటున్నాయి. అంటే కొత్తరకం కవిత్వం మౌళికమైన మార్పులు తెచ్చుకున్నట్టే.

నిజాయితీగా రాయాలన్న తపన ప్రతి కవికీ ఉంటుంది. కానీ- కవి తన అవగాహనా పరిధిలోనే రాస్తాడు. తన అనుభవానికొచ్చిన వాస్తవానికి కల్పనాశక్తిని జోడించినప్పుడు- "కవిత్వం- కేవలం కవి గుండెలోంచి వెలువడేది కాదు. పరిసరాలలో వాతావరణంలోంచి మాత్రమే వెలువ డుతున్న స్పందనల్ని కవి పట్టుకొని ఆర్ద్రతతో అనుక్షణం అక్షరీకరిస్తుంటాడు.

కవిత్వంలో భాషను, యాసను నిలుపుకోవడమంటే- మన తల్లి పాల తీయదనాన్ని మనం గుర్తు చేసుకున్నట్టు. మన మట్టి వాసనను మనం ఎలుగెత్తి చాటుకున్నట్టు. మన చిరునామా మనం సరిగా చెప్పుకున్నట్టు . భాషనుమించిన ఐడెంటిటీకార్డు కవిత్వంలో మనకు ఇంకొకటి లేదు.

కవిత్వం ఒక ప్రత్యేక పరిభాషతో, అది అన్ని జీవుల జీవభాషల్లో వెలువడుతోంది. నిరంతర సాధనచేసే కవి స్థితి అక్షరాలా బ్రాహ్మీస్థితి లాంటిది. మనిషి నాడిని పట్టొచ్చేమోగానీ, కవితా వాక్యంలో వేడిని అప్పటికప్పుడు పట్టుకోలేం. అది ఆలోచనామృత, సద్భావమయినది కూడా.

ప్రస్తుత సమాజంలో సాహిత్యానికి ప్రాతినిధ్యం అధికంగా వహిస్తున్నది కవిత్వం మాత్రమే. మంచి కవిత్వం లేని సమాజం మంచి సంస్కృతిలేని సమాజం కింద లెక్క. జాతి సంస్కృతి గొప్పదనానికి ఉదాహరణ మంచి కవిత్వాన్ని చూపించొచ్చు. ఎందుకంటే- కవిత్వంలో జీవితం ఎలా ఉందో చెప్పడంతో పాటు అది ఎలా ఉండాలో చూపుతుంది కాబట్టి. ప్రజల మధ్య ఉండాల్సిన మానవీయ సంబంధాలు సంస్కృతి గురించి కవిత్వం ప్రతిబింబి స్తుంది కాబట్టి. సమాజంలో ప్రేమించి కాపాడుకోవాల్సిన విలువలు సంస్కృతి, మానవీయ సంబంధాలు సంస్కృతి, మానవీయ సంబంధాలను 'హైలైట్' చేస్తూ ప్రజల హృదయాల్లో సాంస్కృతిక బీజాల్ని కవిత్వంలోనాటే కృషి చేస్తుంది కాబట్టి.

ఎంతో కఠోరమైన కవితా పరిశ్రమతో పాటు ప్రగతిశీలత, పరిశ్రమ, ప్రవర్తనలు ఉత్తమ కవికి ఉన్నత లక్షణాలు. దానికి తోడు కవి వ్యక్తిత్వాన్ని, కవిత్వ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడంలో వాస్తవిక ఆలోచనా ధోరణి, విశాల దృక్పథాలు బహు ప్రధానమని గ్రహించుకోవాలి.

ఒక సమాజం పూర్వాపరాల్ని- కవిత్వం రికార్డు చేస్తున్నప్పుడు అన్ని పార్శ్వాల నుంచి, అన్ని కోణాల నుంచీ ఆలోచించి పరిశీలించి రాసినట్లయితేనే అది సమగ్రమవుతుంది. అదీ వివిధ వాదాలు బలంగా ముందుకు తెస్తున్న కవితాంశాలను- ధోరణులను, కవిత్వ ప్రక్రియ స్వరూపాలను ఏమాత్రం పట్టించుకోకుండా కవిత్వోద్యమకారులను, చరిత్రకారులను కవిత్వంలో స్మరించుకున్నట్లయితే వారికిర్తికి అన్యాయం చేసినట్లే అవుతుంది.

> కవి నిరంకుశుడు అంటారు కానీ అది ఎల్లవేళలా నిజం కాదేమో. కవి వాస్తవిక వాది. నిజాన్ని నిలదీసి, నిగ్గదీసి, నిగ్గుతీయగల స్వభావి.

సాహిత్య రంగంలో చెదురు మదురుగా మాత్రమే పలకరించే- ప్రపంచీకరణ పర్యవసానం, మానవీయతా భావనలు మరుగుపడుతున్న విధానం. నేటి కవిత్వంలో నిండుగా ప్రస్ఫుటమవుతున్నాయని చెప్పకతప్పదు. కొందరి కవుల కవితా పంక్తుల్లో అభ్యుదయ భావాలు, కమ్యూనిస్టు దృక్పథం అన్నిటికీ మించి పతనమౌతున్న మానవీయత, ఎటువంటి చదువరినైనా ఆకట్టుకుంటున్నాయి. అలాగే వస్తు, రూపాలు కవిత్వానికి రెండు కళ్ళులాంటివని చాటి చెప్తూ, సమకాలీన పరిస్థితులకు చక్కగా అద్దం పట్టడం చాల సంతోషం.

ఒకప్పుడు కవులు నిర్భయంగా రాజకీయాల కుహనా విధానాలపై అక్షరాయుధంతో దండెత్తేవారు. అభ్యుదయ కవులు ఇంచుమించుగా పరిపాలకుల అక్రమాలను నాయకుల స్వార్థాన్ని ఎండగట్టినవారే- మరీ నాటి కవులు ఆత్మ పరిశీలన చేసుకుంటే మంచిది.

ఇప్పుడు ఇదంతా ఎందుకంటే- సందర్భం వస్తే చక్కని కవిత్వం చదివే అవకాశం వచ్చినప్పుడు, ఏ సహృదయ పాఠకుడూ ఈ సదవకాశాన్ని కచ్చితంగా వదలుకోడు. వదులకోలేడుగాక.

మంచిదీ, చిక్కనిదీ, చిగురైనదీ కాని నినాదప్రాయమైన కవిత్వంతో, పేరున్న కవుల పేరుతో సాహిత్య పేజీలని నిర్లీవంగా నింపేస్తూంటే- అమూల్యమై ఆ చోటు ఇంకో మంచి సాంఘికోపయుక్తమైన సాహిత్యానికి ఎందుకు వాడకూడదు..!? అని ప్రశ్నించే హక్కు సహృద పాఠక మహాశయులకు ఉందేమో.. ఒక్కసారి ఆలోచించి ఆచరణలో పెడితే బావుంటుందేమో..!!!

-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

హైదరాబాద్ సంస్కృతికి అద్దంపట్టిన కథలు..





నిరుటితరం సాహితీవేత్త నెల్లూరికేశవస్వామి (1920-1984). ఆనాటి హైదరాబాద్ సంస్థాన ముస్లిం జీవన చిత్రకారుడి గా వీరు ప్రసిద్ధికెక్కారు. స్వామి గారి బాల్యం, ఉద్యోగం హైదరా బాద్ నగరంలో గడపటంవల్ల నాటి ముస్లిం సంస్కృతి సాంప్రదా యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసారు. "వెలుతురులో చీకటి" నవల, పసిడిబొమ్మ (1969) మరియు చార్మినార్ (1981) కథా సంకలనాలు వీరి జీవిత కాలంలో వెలువరించబడ్డాయి. సుమారు 100 కథలు, రేడియో నాటికలు అనువాద కథలు, కవితలు రాసిన కేశవస్వామి గారికి నాటి నవా బులు వారి కుటుంబాలతో సన్నిహిత సంబంధాలవల్ల వారి స్థాయి, అభిరుచులు, ఆడంబరాలు, విలాస జీవితాలు వాటి వెనుక భాగం దాగి ఉన్న చీకటి కోణాలను, అధికారం పోయినా, వదులుకోలేని పటాటోపాలు తన కథల్లో బహుశా ఏ రచయిత కూడా వివరించనంత విపులంగా వ్యక్తీకరించారు.



సంకలనంలోని మొదటి నుంచి చార్మినారు. ఇందులో 11 కథలున్నాయి. ఆ.ప్ర. సాహిత్య అకాడమీ వారి బహుమతి కూడా గెలుచుకున్న సంకలనమిది. దేశ విభజన సమయంలో పాకిస్థాన్ వెళ్ళిన తన స్నేహితుడు అజ్జా రుద్దీన్ అహమద్‌కు అంకితమివ్వ బడింది.

సుల్తాన్ జాగీర్‌దార్ ముస్లిం కుటుంబంలో జన్మించిన విద్యాధికుడు. నవాబుల కోఠీల్లో పనిచేసే దాసీజనం, వావివరసలు పాటించకుండా లైంగిక సుఖాలు అందించటం ఆనవాయితీ. అప్పుడప్పుడే యవ్వనంలోకి అడుగిడుతోన్న దానీ 'షిరీం' ఒకనాటి రాత్రి యజమానురాలి బలవంతం మీద సుల్తాన్‌గదిలోకి వస్తుంది. సుల్తాన్‌కది నచ్చదు. కాని ఆమె ముగ్ధత్వం ఆకట్టుకుంటుంది. ఆమెతో పెళ్ళి తన కుటుంబం ఆమోదించరని తెలిసి 'ఓ ఉత్తరం రాసి 'షీరిం'ని దూరంగా తీసుకెళ్తాడు సుల్తాన్. మానవ విలువల్ని ఉన్నతీకరిస్తూ ఆ కుటుంబంలోని ఆచారాల్ని సున్నితంగా అధిక్షేపిస్తూ వ్రాయబడిన కథ "విముక్తి'. ముజ్రా వాతావరణం వివరించే 'రూహీ-ఆపా', బాబాయి కూతురే దుల్హన్ (కోడలు)గా నచ్చే ఆచారం 'ప్రతీకారం'. కథలన్నింటినిండా ముస్లిం సంస్కృతి, ఆడవారిని వారు (ఆనాడు) ఎలా ఒక విలాస వస్తువుగా వాడుకునే వారో రచయిత వివరిస్తారు. హైద్రాబాద్ సంస్థానవిలీనం కాలంలో చెలరేగిన రజాకార్లు, లూటీలు, రావణవధ అనంతరం లూటీ చేయబడిన లంకతో పోల్చటం (యుగాంతం), ఒక గొప్ప ప్రతీ కాత్మత. చార్మినార్ సంకలనంలో ఈ కథ 'హైలెట్' అనవచ్చును.

హైద్రాబాద్ విలీనాంతరం నగరంలోని పరిస్థితులకు అద్దంపట్టే కథలుగా 'పసిడి బొమ్మ' లోని 14 కథలను చెప్పుకోవచ్చును. అవకాశ వాదుల రాజకీయ జీవనం 'ఛోలూ లీడర్', స్వాతంత్ర్య సమరం పాల్గొన్న గోపీ ఆర్థిక స్థితి, అవకాశాల్ని అందిపుచ్చుకుని పైకి ఎదిగి ధనవం తుడైన సూరి 'ఇద్దరి జీవితాశయాలను సమాంతరంగా నడిపించి తేడాలు చూపే కథ 'అలవాటు'లో వివరించిన సమాజం ఇప్పటికీ కనిపించటం రచయిత దూరదృష్టికి నిదర్శనం.

పుస్తక సమీక్ష

'ఇతర కథల' విభాగంలో చతురస్రం (గొలుసుకట్టు కథ) పునర్జన్మ (అనువాద కథ) కథలతో కలిసి మొత్తం 11 కథలున్నాయి. రెండు కథలు- సంస్కారము, ప్రజాకవి తప్ప మిగిలిన కథలు రచయిత చివరి రోజుల్లో వివిధ పత్రికల్లో ప్రకటించబడినవి. ఒక సంఘటనను వేర్వేరు వ్యక్తులు వేరువేరుగా ఉపాఖ్యానించటం 'అసలేం జరిగిందంటే'లో చదువుతాము. అకీరా కురసావా (1910- 1998) జపనీస్. చిత్రదర్శకుడు తీసిన రాసమన్ (Rashomon-1950) చిత్ర కథను గుర్తుకు తెస్తుంది.

మానవత్వమే తన మతమని, మానవ సేవే ధ్యేయమని, 'కేవలం మనుషులం' కథలో ప్రకటించిన, 64 ఏళ్ళు జీవించిన నెల్లూరి కేశవస్వామి, అనుభవాలే ఆయన కథలు. ఆయన కథలే నాటి ప్రజా జీవన ప్రతిబింబాలు. నాటి కావ్య సుమసౌరభాలను మరోసారి మనకు అందించిన తెలంగాణ సాహిత్య అకాడమీ వారు ప్రశంసనీయులు.

ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం
హైదరాబాద్-500 004
ఫోన్: 040-29703142.

- కూర చిదంబరం
సెల్: 8639335675

అక్షర చదరంగం

నా జీవిత చదరంగానికి
అక్షరాలే సైనికులు..
జీవితపు ప్రతి గడినీ
చతురతతో దాటేందుకు
ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసల
ఊర్మిని నాలో నింపే
చతురంగ బలాలు..!!
పదం పదం పదాతి దళంగా
అనుక్షణం నిదాసంగా..
నాతో కదం తొక్కి నడిచి
సంకటాల కంటకాలను..
యుక్తితో తొలగించే...
మొనదేలిన సూదులు..
తామే అవుతాయి..!!
అక్షర అశ్వాలై పరిగెత్తి
నన్ను విజయ పథాల
తీరాలు చేర్చి..
వివేకపు వెయ్యేనుగుల
బలాన్ని నాకందించి..
వెన్నుతట్టి నడిపే
జీవ నాడులవుతాయి..!!
మంథనాల మంత్రులై
సహాల రక్షణ కవచాలు
నాకు తొడిగించి..
రాణి వాసపు రాజసాన్ని
నాలోపెంచి
జీవిత యుద్ధంలో..
శత్రువులను..మట్టి కరిపించే
శౌర్య పరాక్రమాల.
శక్తిని ప్రసాదిస్తాయి..!!
అక్షరాలకు.. అక్షరాలే
ఊపిరుల సాక్షులై..
నన్ను సురక్షత జీవితమనే
సామ్రాజ్యానికి..రాజుగా చేసే
రాజ పురోహితుల మంత్రాక్షతలౌతాయి..
నన్ను మంచి మనిషిగా మార్చి..
మానవత్వపు ఉపదేశాలు చేస్తాయి..!!!

-సావిత్రి రంజోల్కర్
9833497812.

నానీలు

బడి
నాకెప్పుడూ 'గుడి'
మనిషిగా నేను
ఎదిగింది అక్కడే.

డాలర్ కలలు
కూలిపోతున్నాయి
అడుగులన్నీ
ఇప్పుడు నేల మీదనే.

చూడ్డానికి
అమ్మ నదిలా కనిపిస్తుంది
కదిలించి చూడు
మహా సముద్రం.

-వడ్డేపల్లి సంధ్య
సెల్:7036000123

ఇలా సాగి సాగి

ఇక్కడ ఆకారాలు కనిపించవు
అక్షరాలూ కనిపించవు
శిఖరాలు శిఖరాలుగా మొలిచిన
అద్వితీయ భావనా తరంగాల
నిశబ్దం తీగ పై
ఇటునుంచటూ అటునించిటూ
రెక్కలు మొలిచిన పక్షి ఈకలా
అగాధాలను ఈదుకుంటూ
రోప్ వాకింగ్ చెయ్యడమే.

చుట్టూ అల్లుకున్న
గాజు గోళం కళ్ళలోంచి మనసు మెత్తనై
అవిరామంగా ప్రవహిస్తూ
లోపల్లోపల గుడుగుడు గుంచాలాడటమే.

వసంతం తుళ్ళి పడ్డట్టు
తొణికిన ఈ రంగుల వానలో
హరితమై వికసిస్తూ
హరివిల్లై వంగి వంగి
అలల నురగల్లో నీటి కెరటాల్లో
మోహనమై.

ఒంటిగా తలపుల నధిరోహించి
విశ్వదర్శనం
ఎంత సొగసు
ఎండకు వెన్నెల తోడైనట్టు.
ప్రతి క్షణం ఏమారుతూ.....

-స్వాతీ శ్రీపాద
8297248988

అగ్గి తుఫాన్

అదేమి
కప్పనో ఉడుమో కాదు
కండ్లు మూసుకొని పారి పోనీకి.
అదేమి
బల్లియో పిల్లియో కాదు
అలికిడికి ఆవాసం విడిచి పోనీకి
ఎన్ని చెరువుల్ని ఆక్రమణ యావతో
సొంతం చేసుకున్నా
ఎన్ని గూళ్ళని గుడ్లని నలిచి నలిచి
మేడలు మిద్దెలు పెంచుకున్నా
ఎగిరి పోనీకి పక్షికాదు
బెదిరి పోనీకి జంతువూకాదు.
వేల వేల బడబానలతో
బూడిద చేసే అగ్గి తుఫాను అది
కొండలపైనుంచి యిర్రదన్ని
కాలువల మూతులు మూసేసి
వీపులపై మోసిన భారాన్ని
ఎంతకని భరిస్తది
నీ మురికిని యెంతని సహిస్తది.
కాలువలు వాగులు వరదలుగా
భీకర ముఖంతో
గాండ్రిస్తున్న జల వ్యాగ్రమది.
నీటిపుట్టల్ని తవ్వి కింద
ఆకులేసి కూసుంటే
చూస్తూ ఊరుకునే
బేలచూపుల పావురము కాదు.
రోడ్లని సందుల్ని యిండ్లని
నీటి నాలుకల్లో బుసకొడుతున్న
ప్రౌఢ గంభీర భీకర నాగ సర్పమది.
వద్దు వద్దు
నీ మానవీయత లేని మనిషితనం
ఇక చాలించు
తక్షణమే దాని నీటి గాదెల్ని
వదిలి వెళ్ళిపో లేదంటావా
నగరమే సముద్రమై
నిన్ను చేపలు ముట్టని కలేభరాన్ని చేస్తది.

(2020అక్టోబర్‌లో హైదరాబాద్ ను ముంచేత్తిన వరదల గురించి)

- డా.ఉదారి నారాయణ
9441413666

చెంప దెబ్బ

ఆ నాడు"ఆబిడ్స్"లో
"గ్రాండ్ హోటల్" వెనకాల నుండి వెళ్ళక పోతే,
ఎంగిలి బిర్యానీ ఏరుకు తినే
మనుషుల్ని చూసే వాన్ని కాదు !
చెంప మీద ఎవరో చరిచి నట్టు
కళ్ళల్లో నీళ్ళు తిరగక పోతే,
"జల్సాగా" తిరిగే నేను
ఇలా "జఖ్మీ" షాయర్ అయ్యేవాన్ని కాదు !

(ఆబిడ్స్=హైద్రాబాద్ లో ఒక రోడ్డు పేరు.ఇప్పటికీ, నిటీ లో ఇది అందమైన సెంటర్... వగలు వెన్నె

ఉజ్జయిని మహాకాళీ!

"కరోనా" భూతాన్ని సంహరించగా రావమ్మా!

బోనాల పండుగ ప్రారంభం - ఆషాడ మాసాన సంరంభం

"మట్టి పరిమళం"

నేను మట్టి ప్రేమికుడ్ని,
నేను మట్టి ఆరాధకుడ్ని,
మట్టంటే నాకు ఎంతో ఇష్టం,
మట్టితో వుంటే తెలీదు ఏ కష్టం,

తొలి భానుని కిరణాలు
మట్టిని తాకే వేళ
ధగధగ మెరుపుల మట్టికాంతి
నా కన్నులకు ప్రతిరోజు సంక్రాతి
పచ్చిక బయళ్ల మట్టి
పరిమళాన్ని పంచే ఉగాది.

పచ్చటి పొలాల్లో వున్న మట్టి
నేను పూజించే పవిత్ర దేవత,
నదీ జలాలు,సరోవరాల్లో వున్న మట్టి,
నేను కొలచే పుణ్యతీర్థాల
పుణ్యదేవత
నేను మట్టిపై పెంచే ప్రతి జీవరాశి
నాతో కదిలి,నాతో నడిచే తోబుట్టవులు.

మట్టి మంచిదయితే కదా
విత్తు మొలుస్తుంది,
మట్టి గొప్పదైతే కదా,
పంట పండుతుంది
మట్టిని ప్రేమిస్తేనే కదా
మట్టి నిను చేరదీస్తుంది
మట్టిని పూజిస్తేనే కదా
ఆ మట్టి నీకు మంచి ఫలాలను అందిస్తుంది
ఒకసారి మట్టి పనిలోకి దిగావా
ఆ తర్వాత "మట్టి తల్లి" తనవైపు లాక్కొంటుంది,
ఏమీ తెలీకపోయినా అన్నీ తెలెసేలా చేస్తుంది

మట్టిపైన పెరిగేను తరువులు
తరువులుకావవి మనుజులకు తనువులు
చిన్నపాటి వాన చినుకు పడినా
మట్టి దానిని ఆవహిస్తుంది
అదే తరువులకు ఆధారము.

అహము పెరిగిన మనిషి,
అత్యాసకు లోనై,
పంటనిచ్చు మట్టిని,
పసడి వంటి మట్టిని,
ముక్కలు ముక్కలుగా చేసి
రియల్ ఎస్టేట్లుగా మార్చి,
మట్టి రెక్కలు విరిచేస్తే
మట్టి పెట్టిన కన్నీటి శోకము
మానవాళికి శాపముకాదా?
మట్టి ఏ విధముగా పరిమళిస్తుంది?
మట్టి ఏ విధముగా పరిభ్రమిస్తుంది?

మట్టికి విలువనిద్దాం,
మట్టి శక్తిని కాపాడుకుందాం
మట్టి పరిమళాన్ని ఆస్వాదిద్దాం,
సృష్టిలో మట్టికి సాటి మట్టేనని చాటుద్దాం

-విశ్వనాథ నరసింహం
9490971589

వృద్ధాప్యం ఓ పెద్దబాలశిక్ష

అది ఓ అనుభవాల పుస్తకం
బతుకునంత సారంగమల్చుకుని
జీవనగమనంలో వేసిన అడుగులు
నిత్యం కొత్తపుంతలుగామల్చుకుంది!.

ఎన్నో కలలు జీవం పోసుకున్నవి
బాధ్యతల బంధాలు పెనవేసుకున్నవి
నిరంతరం అలుపులేని ప్రయాణం
కష్టాలెన్నో చవి చూసిన అనుభవం!.,

మట్టినిపూజించి ప్రేమించిన మనసు
రేగటి చాల్లపై పగిలిన కాళ్ళ అడుగులు
కొత్త ఆశల విత్తనాలు జల్లినప్పుడు
రేపటికై తపించినవారి తపనెంతగొప్పది!

నెరిసిన జుట్టుయినంత మాత్రాన వారు
నీకు చిన్న చూపుగా కనిపిస్తుండ్లేమో
వెలిసి అలసిన ఆ గుండెవెనుక నీకై
ఆరిపోని తడి ఉందని ఎరుగలేవా!

మసకబారిన కండ్లు ఎండిపోని చెలిమెలు
ప్రతిక్షణం నీ ఎదుగుదలను చూసినవి
ఇప్పుడు దిగ జారిన నిన్ను చూస్తుంటే
గుండెలు బద్దలవుతున్నాయి వాళ్ళకు!

ఏం చెశారని ఇప్పుడు ఆశ్రమాలలో
గాలిదీపాలై కొట్టు మిట్టాడుతున్నారు
నీకు జన్మనిచ్చినందుకావారికి ఈ శాపం
వృద్ధాప్యం ఓ పెద్ద బాలశిక్షని ఎరగవా?

తననెత్తురు పాలుగామార్చి పెంచినతల్లి
వేలుపట్టి నడకనేర్పి వెలుగుచూపిన నాన్న
వారు నీకోసం దారపోసిన జీవితం
ఎక్కడ కనిపించకుండా బైర్లుకమ్మినాయా!

ఇప్పుడు నీవనుభవించే డబ్బు దర్పం
వారు పెట్టిన బిక్షని నీకుతెలియదంలేదా
బీటలు బారిన ఆ హృదయాలలోన
కాసింత ప్రేమ చినుకులు కురిపించలేవా!!

- వజ్జీరు ప్రదీప్
9989562991

అల్లుకున్న స్నేహం

కొన్ని పరిచయాలు
మనసులో చెరిగిపోని చెలిమై
ఎదను నిలిచివుంటుంది.

ఆ మధురానుభూతులన్నీ ఒక్కసారిగా
ముందుపరచుకున్నప్పుడు
మది మురిసిపోతోంది.

ఎన్నో జ్ఞాపకాలు
సంతోష పరిమళాలై
వాడిపోని వీడిపోని బంధాలై
ఆనందతీరాల సుందరదరహాసాలను
కళ్ళముందుంచుతూ కదలాడతాయ్.

నడిచిన అడుగులు స్థిరమై
గడిపిన క్షణాలు అణుక్షణం
కలవరింతల గిలిగింతలుగా
మనసును తడుతుంటాయ్.

పలకరింతలతో పులకరింతలు
నిత్యసూర్యోదయాలుగా
ముందుకు నడిపే ప్రేరణగా నిలుస్తాయ్

మనసేమాత్రం తత్తరపాటు పడ్డ
మేమున్నామంటూ వచ్చి వాలిపోయీ
ధైర్యస్వప్నాలు నాలోనింపి
కలవరం దూరంచేసే
నా హృదయ స్పందనలు
నా నేస్తాలు

-సి.శేఖర్(సియస్సార్),
9010480557

నిండు మోసగాడు. నకిలీ పత్తి గింజలు అమ్మినోడు..

ఒరేయ్!...
కల్లాకపటం తెలియని రైతులను మోసం చేస్తావా ?
నువ్వు తింటున్న తిండి, రైతన్నల చెమట చుక్కల ఫలమని మరిచిపోయావా ?

నిన్ను నమ్ముకొని పంటచేలో ఆ పత్తి గింజలు విత్తుకొని.
ఎండనకా వాననకా సంవత్సరమంతా చేనులో కష్టపడి..
పండే పంట పై కుటుంబం ఆధారపడి..
జీవనం జీవిస్తున్న సంగతి నీకు తెలియదా ?

పారుతున్న నీరు.
రైతన్న ఆలోచనా తీరు..
నీ మోసం సంవత్సరాంతంలో చూసి ఏం చేయాలో తెలియక తల్లడిల్లుతున్నారు.
బాధతో ఉప్పొంగి కన్నీరు కారుస్తున్నారు.
నీకు ఏం పాపం చేశారు ?

నీకు వచ్చే లాభం ఎంతో తెలియదు.
ఈ రైతన్నల నష్టం మరియు కష్టం వెలకట్టలేనిది..
ఎదిగిన కొడుకు ఆగమాగమై తిరుగుతుంటే తల్లిదండ్రులు పడిన బాధ తీరు.
పెరిగిన పత్తి పంట కాయలు లేక పాతిన కట్టె తీరు
నిలబడి ఉంటే ఏం గతి కావాలి ?
చెప్పు నువ్వే చెప్పు.
ఇకనైనా ఈ పని ఆపు.రైతన్నల బాగు కోరాలి నీ చూపు..

-చిలుక సతీష్.

పరిచయం

చెడును దూరం చేసి మంచిని కాపాడిన దేవతలు ఎన్నో అవతారాల్లో దుష్ట సంహారం చేసిన దేవిని భక్తిభావంతో పుజించటమే బోనాల ఉత్సవాలు. తరతరాలుగా జన సమూహంలో ఉన్న నమ్మకాలు, సంప్రదాయాలు ఆచార రూపంగా నిలిచినదే బోనాల పండుగ వేడుక. ఎన్నో రూపాల్లో ప్రజల కడగండ్లను తీర్చే అమ్మవారికి భక్తితో నైవేద్యం సమర్పించే బోనాల పండుగ ఆషాడ మాసం వచ్చిందంటే చాలు, తెలంగాణ ప్రాంతమంతా జరుపుకునే బోనాల పండుగ సంరంభం. ఈ ఏడాది జూలై 11వ తేదిన మొదలయిన బోనాల పండుగ ఆగస్టు, 8వ తేదీతో ముగుస్తుందన్నది గమనార్హం. ఈ పండుగ నెల రోజులు అందరూ భక్తిభావంతో జరుపుకునే పండుగగా చెప్పుకోవచ్చు. ప్రతి ఇంటి గుమ్మాలకు, ప్రతి వీధి వీధికి వేపాకు మండలు కడ్తారు కనుక ఆ వేపాకులో ఉండే గుణం ఆ క్రిమి కీటకాలను నాశనంచేస్తుంది కాబట్టి ఈ పండగలో వేపాకులు ప్రధానంగా వాడుతారు. వేపాకులో ఉన్న గుణం వల్ల ఎటువంటి అంటువ్యాధులు మన జోలికిరావు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిన నాటి నుండి బోనాల పండుగ ఏర్పాట్లను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం ఈ పండుగ సందర్భంగా బడ్జెట్ కేటాయించడం గమనార్హం. ముఖ్యంగా తెలంగాణ జంటనగర వాసులు పూర్తి, భక్తి విశ్వాసాలతో, ఆయా దేవాలయాల్లో మొక్కుబడులు చెల్లించేందుకు వేకువ నుండి వరుసగా బారులు తీరిన మహిళలు మొఖాన పసుపు, సింధూరం తలపై బోనం పెట్టుకుని, సంప్రదాయ దుస్తులతో, అలంకారాలతో స్త్రీలు, కుటుంబ సమేతంగా వెంట తొడ్కొనిపోతూన్న పోతురాజులు ఎర్రని దుస్తులతో, కాళ్ళకు గజ్జెలు ధరించి విన్యాసాలు నృత్యంతో, శివసత్తుల పూనకాలు, హొరెత్తించే దప్పుల చప్పుళ్ళు, ఊయ్యాలతొట్టెలు పట్టుకుని ఊరేగుతూ దేవాలయాలకు నడిచి వెళుతూ సాగే భక్తజన సమూహంతో కదిలి వెళ్తూ జరుపుకునే ఈ పండుగ కొంత రౌద్రం కొంత శాంతం మేళవింపుగా ఉంటుంది. ఏ గల్లీలో చూసినా సందడే సందడి.

బోనాలు పండుగ ప్రాశస్త్యము

పండుగ చరిత్ర 1813లో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో ప్లేగు వ్యాధి వ్యాప్తి చెందడంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోతుంటే ఒక సైనిక బెటాలియన్ను ఉజ్జయిన్లు మోహరించారు. హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి మరింతగా వ్యాప్తి చెందడంతో ప్రజలు ఆందోళన చెందుతున్న క్రమంలో, ఆ పరిస్థితుల్లో మిలిటరీ బెటాలియన్ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహాకాళి ఆలయంలో మాతృదేవతకు ప్రార్థనలు చేసి, ప్రజలు అంటువ్యాధుల నుండి విముక్తి పొందడం కొరకు మహాకాళి విగ్రహాన్ని సికింద్రాబాద్ మోండా మార్కెట్‌గా ప్రసిద్ధిచెందిన ఆ ప్రదేశంలో ఉన్న దేవాలయంలో ఉజ్జయిని మహాకాళిని ప్రతిష్టించడంతో, నాటినుండి జంటనగరాల నలుమూలల నుండి భక్తులు అశేషంగా కదలివచ్చి మహాకాళి అమ్మవారికి బోనాలు సమర్పించడంతో ప్లేగు వ్యాధి నుండి విముక్తి పొందినట్లుగా చెప్పుకుంటారు. ప్రజలు ఆనాటి నుండి ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో మహాకాళికి బోనాలు సమర్పించడం అనవాయితీగా వస్తున్న సంప్రదాయంగా పేర్కొనవచ్చు.

1869లోనూ జంటనగరాలలో మలేరియా ప్రబలడంతో తీవ్ర ప్రాణనష్టం సంభవించిన దరిమిలా, ఆనాడు సైతం మహాకాళీ అమ్మవారిని ప్రసన్నం చేసుకొనే పేరిట తొలి బోనాల జాతర నిర్వహించారు. తరువాత నిజాం నవాబు కూడా ఈ ఉత్సవాలు అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటికి ఆ ఆనవాయితీ అంగరంగ వైభవంగా కొనసాగుతూ వస్తోంది.

బోనాలు

బోనాలు సాధారణంగా జూలై / ఆగస్టులో వచ్చే ఆషాడ మాసం సందర్భంగా జరుపుకుంటారు. బోనమ్ అంటే తెలుగులో భోజనం అని అర్థం, ఇది మాతృదేవికి నైవేద్యం. ఇంట్లో ఉన్న జానపద ప్రజలు పాలు, బెల్లంతో పాటు నూనె మట్టి లేదా ఇత్తడి కుండలో వండుతారు, వీటిని వేప ఆకులు, పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. మహిళలు ఈ కుండలను (బోనమ్) చేసిన నైవేద్యం తమ తలపై పెట్టుకొని దేవాలయంలోని మాతృదేవతకు బోనంతోపాటు పసుపు, కుంకుమలు, చీరలు, జాకెట్లు ఇంకా గాజులు మరియు దేవతకు వారివారి మ్రొక్కిన మొక్కుబడిని అనుసరించి సమర్పించుకుంటారు. బోనాలులో హైదరాబాద్, సికింద్రాబాద్ నగర వీధి వీధిలో (గల్లి గల్లీకి) అమ్మవార్లుగా పూజించే మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, దోక్కలమ్మ, పెడమ్మ, పోలేరమ్మ, ముత్యాలమ్మ, అంకలమ్మ, మరేమ్మ, నూకాలమ్మ, పెద్దమ్మ మొదలైన వివిధ రూపాల్లో కొలువైన ఒక్కొక్క దేవతకు తమ శక్తి కొలది బోనం నైవేద్యంగా సమర్పిస్తారు. బోనం ఎత్తుకున్న మహిళను అమ్మవారి అంశగా భావిస్తారు. తల్లిగారింటికి కుమార్తె వచ్చినట్లుగా అమ్మవారికి నైవేద్యంతో పాటు పట్టుచీరలు, రకరకాల కానుకలు సమర్పించి వడి బియ్యం పోస్తారు. ప్రకృతిని, అమ్మవారిని... వెరసి సమాజాన్ని గౌరవించడంగా బోనం ఆంతర్యాన్ని చెప్పుకోవచ్చు. గోల్కొండ కోట మీద ఉన్న జగదాంబిక ఆలయంలో మొదలయిన బోనాల ఉత్సవాలు బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి, లాల్ దర్వాజ సింహవాహిని, ఇలా ఒక్కో దేవాలయంలో ఒక్కో దేవతగా ఆరాధించబడతారు.

బోనాల పండుగలో ముఖ్యమైనది బలి. ప్రధానంగా బోనాల పండుగకు మేకలను, గొర్రెలను, కోళ్లను అమ్మవారికి బలి ఇస్తారు. ఈ బలికి కూడా శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. సాధారణంగా ఈ ఆషాఢ మాసంలో మొదలయే వర్షా కాలంలో వచ్చే అంటువ్యాధులు మనుషుల కన్నా ముందు కోళ్లకు, మేకలకు, గొర్రెలకు మొదలైన వాటికీ త్వరగా సోకే అవకాశం ఉంది కనుక ఆ వ్యాధి బారినపడక ముందే వాటిని బలి ఇవ్వడం గమనార్హం.

ఆచారం

ఒక్కో ప్రాంతంలో ఒక్కో చరిత్రగా బోనాల పండుగ హైదరాబాద్, సికింద్రాబాద్ నగరవాసుల జీవనంలో గ్రామ దేవతలకు బోనాల సంస్కృతి నిజాం నవాబుల కాలం నుంచే పండుగ జరుపుకొనేవారు. ఏటా వర్షాకాలంలో వచ్చే మహమ్మారుల బారి నుంచి రక్షించాలని ప్రకృతి వేడుకుంటూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. బోనాలు నగరంలోని వివిధ ప్రాంతాలలో జరుపుకునే ఆచారంగా వస్తున్న సాంప్రదాయం ఆషాడం మొదటి ఆదివారం సందర్భంగా, గోల్కొండ కోట వద్ద తొలి బోనంతో వేడుకలు ప్రారంభమవుతాయి, తరువాత బల్కంపేటలోని ఎల్లమ్మ కళ్యాణం బోనం సమర్పణ, మూడవ ఆదివారం సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహాకాళి ఆలయానికి లక్షల మంది భక్తులు మహాకాళికి బోనం సమర్పించేందుకు తలపై బోనంతోపాటు పసుపు, కుంకుమలు, వేపాకులతో అలంకరించిన కుండలతో బయలుదేరిన భక్తులు ఆరోజంతా తండోపతండాలుగా నగరం నలుమూలల నుంచి తరలివచ్చిన జనంతో అంబరాన్నంటే సంబరాలతో వేళతాళాలతో అలంకరించిన తొట్టెలతో బోనం సమర్పించడానికి దేవాలయాలకు కదిలి వస్తారు. ఆ సంబరాన్ని చూసేందకు రెండు కళ్ళు చాలవు. తదుపరి ఆఖరివారం హైదరాబాద్, సికింద్రాబాద్ నగరంలోని (గల్లి గల్లీ) దేవాలయాలన్నీ ఒకే రోజు ఆయా ప్రాంత దేవతలకు బోనం సమర్పించుకుంటారు.

ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు, ఆభరణాలు ధరించినవారై తలమీద బోనం సమర్పించడానికి సిద్ధమైన కుండలతో, ఆ ప్రాంతంలో మారుమ్రోగుతున్న భాజాభజంత్రీలకు లయబద్ధమైన నృత్యం చేస్తూ కదిలి వస్తుంటారు. బోనం అంటే భోజనం. అమ్మవారికి నైవేద్యాన్ని (భోజనాన్ని) కృతజ్ఞతతో సమర్పించే పండగ బోనాలు. నిత్యం ప్రకృతి రూపంలో, ప్రతి కదలికలో మనల్ని కాపాడే అమ్మవారు ఎన్నో రూపాల్లో దర్శనమిస్తుంది. ఆ దేవతలను ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకుంటూ బోనంతో పాటు, రకరకాల ఉయ్యాల తొట్టెలను సమర్పిస్తారు. మనిషి జీవితానికి ప్రతీకగా చాలా మంది మట్టి కుండలో బోనాన్ని సమర్పిస్తారు. బెల్లం, పాలు, పెరుగు లాంటి వాటితో కలిపి చేసిన అన్నాన్ని బోనం కుండలో పెట్టి వేపాకులతో అలంకరించి, దాని పైన మూతలో దీపాన్ని ఉంచుతారు. మొదటగా దాన్ని ఇంట్లో దేవుడి దగ్గర ఉంచి ఇంటిల్లిపాదీ భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. తర్వాత బోనం తలకెత్తుకుని వెళ్లి అమ్మవారికి బోనం సమర్పిస్తారు.

పోతురాజు

పోతురాజు ఎర్రటి ధోతి, చీలమండల దగ్గర గజ్జెలు ధరిస్తాడు. పోతురాజు శరీరంపై పసుపును దట్టించి నుదిటిపై సింధూరంతో కనిపిస్తూ కదిలివస్తున్న పోతురాజు అద్భుతమైన డ్రమ్ము నృత్యం చేస్తూ సందడిచేస్తారు. పోతురాజు, మాతృదేవత యొక్క సోదరుడిగా పరిగణించబడతాడు. బోనాల పండుగలో పోతరాజుల విన్యాసాలు, రంగం లాంటివి ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి.

విందు

దేవతకు సమర్పించిన బోనం, తదుపరి అమ్మవారి నైవేద్యాన్ని ఇంటికి తీసుకొని వెళ్ళి బంధుమిత్రులతో పంచుకుంటారు.

రంగం

అసలు పండుగ మరుసటి రోజు ఉదయం తర్వాత రంగం, ఒక స్త్రీ పై మహాకాళి దేవత ఆవహించి భవిష్యత్తు గురించి సమాచారం అడిగినప్పుడు మరుసటి సంవత్సరం గురించి ఆమె (మహాకాళి) ముందే కష్టసుఖాలు చెబుతుండడం ఆనవాయితీగా వస్తున్న ఆచారంగా భక్తుల విశ్వాసం.

ఘటం (అమ్మవారి ఊరేగింపు)

బోనాల పండుగలో ముఖ్యమైన ఘట్టం అమ్మవారి ఊరేగింపు. ఊరేగింపు సమయంలో అమ్మవారి రథం ముందు డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, వేపాకులతో పాటు, గుగ్గిలం పొగ వేస్తారు. ఈ ఊరేగింపుకి కూడా కారణాలు ఉన్నాయి. ఊరేగింపు సమయంలో డప్పు చప్పుళ్లు ఆ చప్పుళ్లతో పాటు పోతరాజులు నృత్యం చేస్తూ అరుస్తారు. అప్పుడు ఆ డప్పు చప్పుడు పోతరాజుల అరుపుకు ఊర్లో ఉన్న కొన్ని ప్రమాదకరమైన జంతువులు భయంతో పారిపోతాయి. అమ్మవారి ఊరేగింపు సమయంలో అమ్మవారికి గుగ్గిలం పొగ వేస్తారు. వర్షా కాలంలో వ్యాప్తి చెందే దోమలు, ఇతర క్రిమికీటకాల నుండి రక్షణకు ఈ పొగ వేయడంతో, ఆ పొగ వల్ల క్రిమి కీటకాధులు నశిస్తాయి. తద్వారా అంతర్లీనంగా సమాజ శ్రేయస్సుకు హితం కోరే విధంగా బోనాల పండుగ నేపథ్యం ఉంటుందన్నది సుస్పష్టం.

ఘటం ఒక రాగి కుండను సూచిస్తుంది, ఇది తల్లి దేవత రూపంలో అలంకరించబడి పూజారి చేత తీసుకువెళ్ళబడి, సాంప్రదాయ ధోతిని అలంకరిస్తుంది మరియు అతని శరీరం పూర్తిగా పసుపు రంగులో ఉంటుంది. పండుగ మొదటిరోజు నుండి చివరిరోజు వరకు నీటిలో మునిగితే ఘాటం ఊరేగింపుగా తీసుకుంటారు. ఘటం డ్రమ్స్ (వాయిద్యాల)తో పాటు వస్తుంది. సాధారణంగా హరిబౌలిలోని అక్కన్న మదన్నా ఆలయానికి చెందిన ఘటం ఊరేగింపుకు నాయకత్వం వహిస్తుంది. జంట నగరాల్లోని మహాకాళి, ఇంకా ఇతర ప్రసిద్ధ దేవాలయాల నుండి ఘటములు ఊరేగింపుగా చేరి, ఇక్కడ సమావేశమవుతారు. ఈ ఘటముల ఊరేగింపు అందంగా, ఆకర్షణీయంగా భక్తుల హృదయాలను ఆకట్టుకునే విధంగా ఉండటంతో భక్తులు సమూహంగా తరలి వచ్చి ఊరేగింపు వెంట సాగుతూ కోలాహలంగా సంబరాలు చేసుకుంటారు. చివరగా నయాపూల్ వద్ద ఘాటమ్స్ నిమజ్జనంతో బోనాల పండుగ ముగుస్తుంది.

ముగింపు

గత ఏడాది మొత్తం మహమ్మారి "కరోనా" భూతం జనంపై విరుచుకుపడిన నేపథ్యంలో, జన జీవనం మొత్తం అస్తవ్యస్థమై, పండుగలన్నీ ఇంటికే పరిమితం కావడంతో మహిళలు ఈ ఏడాది బోనాల పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించుకోవాలనీ, దేవీ దేవతలకు మనసారా మొక్కి, మొక్కులు తీర్చి బోనం సమర్పించుకోవాలనీ, కరోనా భూతం నుండి కాపాడమని ప్రార్థించడానికి బోనాల పండుగ కోసం ఎంతగానో ఎదురు చూస్తున్న విషయం విదితమే. కావున పండుగ జరుపుకునే భక్తులు అప్రమత్తంతో ఉంటూ ప్రభుత్వ నియామాలు పాటిస్తూ పండుగ జరుపుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఐతే అందుకు గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన అంశాలు మాస్క్ ధరించడం, సోషల్ డిస్టెన్స్ పాటిస్తూ బోనాల పండుగను జరుపుకోవడం శ్రేయస్కరం.

-శారద శృంగేరి
సెల్: 9490261119

ధారలు

ధారలు బాతులను పోలిన పిట్టలు..
పగలంతా చెరువు అద్దంలో ముఖం చూసుకొని
రాత్రి మాత్రమే కాసిన్ని మెతుకులకై
నాచులో నక్కిన క్రిములను,
పోజుకొడుతున్న పరకలను,
మిడతలను..గడ్డి పురుగులను,
గతిలేకుంటే నాచునే నంజుకుతినే నైజం...
కత్తెర ముక్కుతో కత్తిరించిన భాగాలు
నోట్లో సర్కస్ ఆడుతూ బోట బోట
శబ్దం చేస్తూ గొంతులోకి సళ్లగా జారుతవి.

ఎప్పుడూ గుంపులు గుంపులుగా,
నక్షత్రాలు చెర్లో దిగినట్టు...
నీళ్ళు పారిన మడి సూట్టు
రెక్కల్ని సాపి పాత జ్ఞాపకాలను
నోటి దువ్వెనతో దువ్వుతూ నెమరేసుకునే దృశ్యం
అటుపొంటి పోయే నాగళ్లను
అలసిన పాదాలకు కనువిందు చేస్తవి
నేలమ్మా బాతుల వనంతో పులకించి
అడుసు చీరను ధరించి తెగ మురిసి పోతది.

రాయబారం చిలుకలు
శృంగార నైషధ హంసలు
ప్రేమ సందేశ పాయిరాలు కావ్య పుస్తకంలో
తమ ప్రతిభను అక్షరాలలో ఎగిరించిన కవులున్నరు....
ధారలు స్ఫురణకు రాకపోవడం
నిజంగా వాటి అదృష్టం...
లేకుంటే మేఘసందేశం మొదలు
అరుంధతి సుతుని ఘోడు వినిపించే గబ్బిలం దాకా
అన్ని అవకాశాలు అందిపుచ్చుకుని
అందం దానిసొంతం..

ముక్కు త్రివర్ణ మయం
రంగు విభూతి మయం
పాదాలు విశాల తెడ్డును తలపిస్తాయి
దిశ పరిజ్ఞానంలో అమోఘమేధాసంపత్తిని
కండ్లలో దాచుకొని
కప్పాలను రెక్కల ఈకలకు అప్పజెప్పి
ఆకాశమే శ్వాసగా అవదిలేని ఖండాంతరాలకు
అవలీలగా ఎగిరే ధారలు..
పక్షి జాతిలో మేటి ధీరులు.

చెరువమ్మ నీటి వొడిలో
మడి తోరనాలైన ఉచ్చులు
వేసిన మందుగులికలకు,
ఎన్ని మాంసం ముద్దలై.....
ఆకలి దెయ్యాన్ని చంపడంలో
ముందున్నందుకు మురిసిపోయే
వేటాధారిత జీవితాలు ఇప్పటికీ ఎప్పటికీ ఆడాడా
ఊరి చివర్లో నల్లని గుడిసెలోనో,
గాలిలో ఊయలలుగే తాటి మట్ట పందిరిలోనో,
ప్లాస్టిక్ పరదా గూటిలోనో,
ఎవ్వల్లకు పట్టని బాతులు తినే బాపతుగా
బతుకెళ్ళదీస్తున్నరు.....

పాప ,పుణ్య ,కర్మ పదాల స్థానాన్ని
ఆలీ, పిల్లల పోషణకుంపటిలో
భస్మం ఆక్రమించక తప్పదు..
క్షుద్బాద వేట నుదుటిపై ఎప్పుడు
దారిద్ర్యం తాండవాన్ని చూసి అలసిన
బురద పాదాలు బురదలోనే మృత్యువు
కొరలకు బలయ్యిన వేట గుడిసెలు
ఏ రెవెన్యూ లెక్కలోకి రావు...
ఏ పింఛనుకు నోచుకోవు.....
ఉచిత రేషన్ స్వప్నంలో కూడా పొందని
అల్పసంఖ్యాపాదాలు మరో మట్టిని వెతుక్కునే పనిలో
రోడ్డుని ముద్దాడి నేత్తురుతో తారుని
రంగులద్దిన ఇంటి దీపం కోల్పోయిన కూనాలు
మొత్తుకుంటున్నా హౌన గాలులా శబ్దం
ఏ కర్ణాన్ని చేరవు..

చేరినవి. అయ్యో! పాపం అనే మరమరాలు
గాలిలోనే చల్లి నిష్క్రమించే గొంతులు
బోలెడున్న ఈ దేశం..
ఎప్పుడూ.. వేటాధారిత జీవులకు
బతుకు భద్రతను కల్పిస్తుందో?
ఎన్ని స్వతంత్ర సంబురాలు చుడాల్నో?
ఈ ధారల్ని నమ్ముకు జీవించే కన్నుల
కడగండ్లు కరిగించి ఘనీభవించిన బురద పాదాల్ని
కడిగే జలం కోసం...
ఎన్ని తరాలు వేచిచూడాలో?...

-నాగరాజు మద్దెల
6301993211.

నిన్ను నువ్వు

నిన్ను నువ్వు
కాపాడుకోవాలి
అనిచూడకు
వర్షపు జల్లు లో తడిస్తే
ఆనందమే కదా.

చందమామను
ఎవరు తెచ్చి
ఇవ్వలేరు
నీ అందమైన
ముఖంతోనే
ప్రకాశించాలి.

కన్నీళ్లు చాలా
విలువైనవి
ముత్యాలు
రత్నాల
కంటే విలువెక్కువ
కళ్ల నుంచి
ప్రవహించనివ్వకు

అందమైన పెదవులపై
చిరునవ్వు మెరవనివ్వు
మాటల మధ్యలో
చిరునవ్వు
ముచ్చటగా
ఉంటుంది సుమా.

ఉదయాన్నే
సూర్యుని వెచ్చని
కిరణాల స్పర్శ
వృధాగా పోనీకు
అప్పుడప్పుడు
మేడ మీదకి
ఏదోఒక వంక తో
వస్తూ ఉండు.

ఎవరన్నారు
మనసును
కలపమని
కనీసం
కరచాలనం
చెయ్యవచ్చు కదా.

-అరుణ డేనియల్
9000606889

ఖడ్గ కలం

నీ కలం...
కలకాలం కష్టజీవుల
కన్నీళ్ళు తుడవాలి

నీ కలం...
బాధాతప్త హృదయాలకు
సేద తీర్చాలి

నీ కలం...
పెత్తందారుల కుత్తుకులపై
రంపపు కత్తి కావాలి

నీ కలం...
రైతన్న వెతలకు
భరోసా ఇవ్వాలి

నీ కలం...
కార్మిక లోకానికి
బాసటగా నిలవాలి

నీ కలం...
రొచ్చు రాజకీయాలకి
చరమ గీతం పాడాలి

-కయ్యూరు
బాలసుబ్రమణ్యం
9441791239

చిరంజీవి

మనసుకు
మనసుకు
వారధి కట్టేది
వలపు వశీకరణం.

మనిషిని
మనిషితో
కలిపి ఉంచేది
మమతల మంత్రం.

ఆత్మను
ఆత్మతో
అనుసంధానించేది
అనురాగపు అంతస్సూత్రం.

అంతరంగాన్ని
అంతరంగంతో
ముడివేసేది
అభిమానపు ఊలుదారం.

ఒంటరిని
ఒంటరితో
జంట గూర్చేది
కంటి ఇంద్ర జాలం.

అందరిని
ఇద్దరిని
ఆకర్షించేది
ప్రేమ అయస్కాంతం.

అటుని
ఇటు ప్రక్కన
నిలబెట్టేది
పరస్పర ఆలంబనం.

ఆ...ఈ..ల
చేరికకు
కారణమయ్యేది
ఒండొరుల విశ్వాసం.

ఆడ..ఈడ..ల
నొకటిగ
అంటుకట్టేది
ఆత్మీయతా కరచాలనం.

పుట్టుక నుంచి
మట్టి అయ్యేదాకా
పట్టి ఉంచేది
పెనవేసుకున్న రాగబంధం.

ఆ బంధమే
అన్ని బాంధవ్యాలకు
అపురూప సంబంధాలకు
ఆదియని తెలియండి.

మరణశయ్యపై నున్న
అనుబంధాలకు
స్నేహపు ఊపిరులూది
చిరంజీవిని చెయ్యండి!

- ఎస్. కాశింబి
సెల్: 9052216044



చారిత్రక నవల మహోదయం



'మహోదయం' బీనీడి కృష్ణయ్యగారు రచించిన చారిత్రక నవల. కృష్ణయ్యగారు బహుగ్రంథకర్త. వివిధ ప్రక్రియలలో రచనలు చేశారు. రామాయణ, భారతాలు, మహా భాగవతం ఔపోసన పట్టిన పండిత కవి. అనేక సాంఘిక నాటకాలు, నాటికలూ రచించిన వీరు నటులు కూడా. అయ్యప్ప కరుణ, కౌరవ సామ్రాజ్యం సినిమాలకు పూర్తి సంభాషణలు సమకూర్చారు. ఈటీవి మెగా సీరియల్ శ్రీభాగవతంకు రచనా సహకారం అందించారు. బుద్ధుని చరిత్రను ఇంతకు ముందు 'మహావిజేత' పేరుతో ఒక నవలగా వెలువరించారు. ఈ పరంపరలో మహోదయం రెండవది. ఇది జనవరి 2021లో వెలువడింది.

క్రీ.పూ. ఆరవ శతాబ్దిలో నేపాల్ భూభాగంలోని కపిలవస్తు నగరంలో శాక్యరాజవంశంలో జన్మించిన సిద్ధార్థుడు సర్వసుఖాలు పరిత్యజించి, సన్యాసియై సర్వమానవాళికి శాంతి, సమభావనని బోధించి గురువైనాడు. బౌద్ధం ఆసియా ఖండంలో సింహళం, బర్మా, జపాన్, చైనా వంటి దేశాలకూ విస్తరించింది.

బుద్ధుడి జీవనం, బోధనల మీద 1879 జూలైలో సర్ ఎడ్విన్ ఆర్నాల్డు 'ది లైట్ ఆఫ్ ఏషియా' శీర్షికన మహాకావ్యం రాశారు. ఇది ఎనిమిది పుస్తకాలలో పద్య నియమాలు అంటే ఛందో పద్ధతులు ఏమీ పాటించకుండా రాసిన కావ్యం. ఒకొక్క పుస్తకంలో సుమారు అయిదారొందల పంక్తులు ఉన్నాయి. సర్ ఎడ్విన్ ఆర్నాల్డు బహుభాషావేత్త. నలభై ఏండ్లకు పైగా లండన్ నుండి వెలువడే 'ది డైలీ టెలిగ్రాఫ్' పత్రికలో పనిచేశారు. భారతదేశం గురించి తెలుసుకోవాలనే ఆసక్తిగలవాడు. 'ది లైట్ ఆఫ్ ఏషియా' గ్రంథం ప్రాచీన భారతావనిలో సాంస్కృతిక వికాసాన్ని, సామాజిక రాజకీయ స్థితిగతులను అంతర్జాతీయంగా పరిచయం చేసింది. దీనిని ఇటీవల జైరామ్ రమేష్ ముందు మాటతో పెంగ్విన్ సంస్థ ముద్రించింది. ఆధునిక భారతదేశంలో మేధావులైన మహాత్మాగాంధీ, టాగూర్, వివేకానందుడు, నెహ్రూ, అంబేద్కర్ మున్నగువారి మీద బుద్ధుడి ప్రభావం ఎంతో ఉన్నదని జైరామ్ రమేష్ పేర్కొన్నారు.

తెలుగు సాహిత్యం విషయానికొస్తే గౌతమబుద్ధ పేరుతో చిలకమర్తి లక్ష్మీ నరసింహం బుద్ధచరిత్రను వ్రాశారు. కాటూరి పింగళి కవుల సౌందరనందం, జంధ్యాల పాపయ్యశాస్త్రి 'కరుణశ్రీ' కావ్యాలు ప్రసిద్ధాలు. బుద్ధుడి చరిత్ర ఎంతో మంది మేధావులను, రచయితలను ప్రభావితం చేస్తూ, వారి చేత రచనలు చేయిస్తూనే ఉన్నది.

నవల అంటేనే జీవితాన్ని సుదీర్ఘంగా వ్యాఖ్యానించే ప్రక్రియ. చీనీడి కృష్ణయ్యగారు బుద్ధ చరిత్రను చారిత్రక నవలగా రూపొందించారు. చారిత్రక నవల రాయటం కష్టమైన పని. చారిత్రక నవలాకారుడు కాలాన్ని అధిగమించి, మనోనేత్రంతో ఆ గతకాలాన్ని, సమాజాన్ని దర్శించి, తన రచనా కౌశలంతో మన కండ్లముందు ఆ చూసిన విషయాన్ని ప్రత్యక్షీకరించే శక్తి కలిగి ఉండాలి. చరిత్ర విషయం సేకరణలో కాని, దానిని నవలలో ఒదిగించి, కల్పనతో మేళవించేటప్పుడు రచయిత అత్యంత జాగరూకుడై పఠితను మెప్పించగలిగి ఉండాలి. వాస్తవానికి ఈ రకమైన నవల రాయటం కత్తిమీద సాము వంటిది. కష్టతరమైన దీనిని నిర్వహించటంలోనే ఈ రచయిత ప్రతిభ వ్యక్తమౌతోంది.

ఇతివృత్తం :

బుద్ధుడు కపిలవస్తు రాచనగరులో భిక్ష స్వీకారానికి అంగీకరించి, రాజమందిరం వెలుపలి ప్రాంగణానికి రావటంతో ఈ నవల ప్రారంభమౌతున్నది. శుద్ధోదనుడు మరియు ఇతర కుటుంబ సభ్యులు బుద్ధుని దర్శించి ఆనందానుభూతికి లోనవుతారు. బుద్ధుని అనుగ్రహభాషణం వింటారు. ప్రజాపతి గౌతమి కుమారుడు నందుడు, యశోధర కుమారుడు రాహులుడు సన్యాసదీక్ష స్వీకరించాలని భావించటం శుద్ధోదనునకు మనస్తాపం కల్గిస్తుంది. బుద్ధుడు కొన్ని దినాల తర్వాత ధర్మచక్ర ప్రవర్తనం అంటే పలు ప్రాంతాలు సంచరిస్తూ అక్కడ ఈ ధర్మబోధనలు చేసే కార్యక్రమం నిమిత్తం కపిలవస్తు నుండి బయలుదేరతాడు. బుద్ధుని బోధనలకు, రాజులు : అన్ని వర్గాల వారూ కులమత, ప్రాంతాల కతీతంగా ఆకర్షితులౌతారు. బ్రాహ్మణ పండితులతో వాదించి, వారిని ఈ ధర్మం అంగీకరించేటట్లు చేస్తాడు బుద్ధుడు. ఈ క్రమంలో బుద్ధుడు శిష్యగణాలతో శాక్య, కురు, అంగ రాజ్యాలు, రాజగృహ, శ్రావస్తి, వైశాలి నగరాలు : జనపదాలు అనేక ప్రాంతాలు దర్శించి సమావేశాలు నిర్వహిస్తూ ఉంటాడు. బుద్ధుడు తన ప్రధాన శిష్యులైన మహాకాశ్యపుడు, సారి పుత్రుడు, ఆనందుడు, మౌద్గలాయనుడు మున్నగువారి ద్వారా సందేశాలను విస్తరింపజేస్తాడు. మానవులందరూ సమానులే అన్న భావనని వ్యాప్తి చేస్తూ సమాజం చులకనగా చూస్తున్న వారిని దయతో అక్కున జేర్చుకుంటాడు. బుద్ధుడు 'ఆర్య అష్టాంగ మార్గం' ద్వారా మనుష్యుల నడవడికను నిర్దేశించాడు. మన మనస్సు, వాక్కు, కర్మలను సరియైన మార్గంలో నడిపించుకోవాలని బోధించాడు. పంచశీల బుద్ధుడు చెప్పిన సన్మార్గం. జీవహింస చేయరాదు, దొంగతనం చేయరాదు, వ్యభిచరించకూడదు, అసత్యమాడరాదు, మత్తు పదార్థాలు, మద్యం సేవించరాదు. ఇదే పంచశీల. మహారాజులూ, రాజ ప్రముఖులూ, ధనికులూ బుద్ధుని ప్రసంగాలకు వచ్చి, దీక్ష స్వీకరించి విశేషంగా కానుకలు సమర్పించేవారు. బుద్ధుడు భిక్షువులకు నియమావళి ఏర్పరిచాడు. శీలం ప్రధానమనీ బోధించాడు. మగధ చక్రవర్తి బింబిసారుడు, కాశీరాజు ప్రసేనజిత్తు, బింబిసారుని కుమారుడు అజాత శత్రువు మున్నగు రాజులు బౌద్ధమతావలంబులై శాంతిపథం లో ప్రవేశించారు. స్త్రీలకు భిక్ష దీక్ష ఇవ్వటం ప్రజాపతి గౌతమితో ప్రారంభమైంది. సమాజంలో మానవతావాదం మొగ్గ తొడగటానికి ఒక సాంస్కృతిక నిర్మాతగా నిలిచిన బుద్ధుడు ఎనభైఏళ్ల వయసులో వైశాఖ పూర్ణిమ (క్రీ.పూ. 483)లో కుసినారలో మహాపరి నిర్వాణం చెందాడు. బుద్ధుని నిర్యాణం అనంతరం భిక్షు నియమాలు వినయపిటకంగానూ, ధర్మసూత్రాలు 'సుత్తపిటకం'గా శిష్యులు గ్రంథస్థం చేశారు.

బుద్ధుడు చారిత్రక వ్యక్తి. ఆయన సర్వసంగ పరిత్యాగం గురించి 1940ల వరకూ భారతీయ బౌద్ధ సాహిత్యం కానీ సర్ ఎడ్విన్ ఆర్నాల్డు మహాకావ్యం కానీ ఒకటే విషయం చెప్పేవారు. ఒక వయోవృద్ధుడిని, రోగిని, శవాన్ని, ఒక సన్యాసిని రాకుమారుడు చూడటం వలన అతడిలో విరక్తి – వైరాగ్యం కలిగి – ఇంటి నుండి వెళ్ళిపోయాడని ! ప్రముఖ చరిత్రకారుడు, పాళీ భాషా పండితుడు, బౌద్ధమతావలంబి ధర్మానంద కోశాంబి 'బోధిసత్త్వ నాటక'లో బుద్ధుని సర్వసంగ పరిత్యాగం గురించి కొత్త విషయాలను ఆవిష్కరించారు. శాక్యులు, కోలియుల – అంటే సిద్ధార్థుని పితృ, మాతృ వర్గీయులైన రెండు తెగల మధ్య జల వివాదం – యుద్ధంగా పరిణమించటం సిద్ధార్థుడు వ్యతిరేకించాడు. తీవ్ర మానసిక వేదనకి గురి అయిన సిద్ధార్థుడు అన్నీ వదులుకొని వెళ్ళిపోయాడు. ఈ 'బోధిసత్త్వ నాటక' కోశాంబి మరణానంతరం 1949లో వెలువడింది. ప్రాచీన భారతదేశ చరిత్రలో రాజకీయ, సామాజిక రంగాలలో బుద్ధుడు నిర్వహించిన పాత్ర గురించి నమోదు చేసే చరిత్రకారులు మళ్ళీ సరి చూడాల్సిన అవసరాన్ని కల్పించింది. ఒక కొత్త చూపుని ప్రసాదించింది. కోశాంబి కొత్త దృష్టికోణం ఈ నవలలో చూడవచ్చు. బుద్ధుడు ధైర్యం, సహనం, ఔదార్యం జ్ఞానం మూర్తీభవించిన మానవతామూర్తి. ఆయా గుణాలు వివిధ సందర్భాలలో ప్రకటితమయ్యేలా రచయిత నవలలో కల్పించారు. బుద్ధుని సవతి సోదరుడు దేవదత్తుడు చిన్ననాటి నుంచీ బుద్ధుడి మీద ఈర్ష్య, అసూయ భావనలు ఉన్నవాడే. బౌద్ధ సంఘాలపై కూడా తన ఆధిపత్యం ఉండాలని, బుద్ధుడిని అపకీర్తిపాలు చేయటానికి యత్నిస్తాడు. అయితే బుద్ధుడు దేవదత్తుని చర్యలన్నింటిని సంయమనంతో ఎదుర్కొంటాడు. దేవదత్తుడు చివరకు పశ్చాత్తాపంతో మరణిస్తాడు. దేవదత్తుడు ఈ నవలలో ఒక రకంగా ప్రతినాయకుడు.

కడజాతి వాడని, అంటరాని వాడని అందరూ దూరం పెట్టే సునీతుడిని బుద్ధుడు చేరదీశాడు. అతడికి భిక్షు దీక్షను ప్రసాదించాడు. క్షురకుడైన ఉపాలికి భిక్షు దీక్షని ప్రసాదించి తన ముఖ్య శిష్యులలో ఒకనిగా స్థానమిచ్చాడు. ఆయా సందర్భాలలో ఎదురైన సామాజిక వ్యతిరేకతను తన వాదనా పటిమతో ఎదుర్కొన్నాడు. శ్రావస్తిలో మరొక అస్పృశ్యుడు స్వపాకునికీ, కాటికాపరి కుమారుడు సుప్రియునికి దీక్ష ఇస్తాడు. బుద్ధుడిలో మహనీయ శక్తి, దివ్యదృష్టి తెలియజేసే సందర్భాలు ఈ నవలలో కొన్ని చిత్రించబడ్డాయి. కోసల రాజ్యం అంతటినీ భయభ్రాంతులను చేస్తున్న నరహంతకుడు అంగుళీమాలుడు. అతడిని తాను సన్మార్గంలో పెడతానని బుద్ధుడు రాజుతో పలికి, అంగుళీమాలుడి దగ్గరకు వెళతాడు. అంగుళీమాలుని చూడగానే బుద్ధుడికి అతడి పూర్వ జీవనమంతా తెలియవచ్చింది. బుద్ధుడు తన బోధనతో అంగుళీమాలునిలో మార్పు తెచ్చి బౌద్ధ భిక్షువుగా చేయగలిగాడు. బుద్ధుడు అంటే గిట్టని వారు ఆయనను అపకీర్తి పాలు చేయాలని సంకల్పించి, 'చించ' అనే యువతిని ఆయన మీద ప్రయోగించారు. 'చించ' అందరి ముందు బుద్ధుని వలన తాను గర్భవతి నయ్యానని అసత్యం పలుకుతుంది. బుద్ధుడు ఆమెను 'సోదరీ' అని సంబోధించి ఆమె తప్పిదం తెలుసుకునేటట్లు చేస్తాడు. భరించలేని ఉదరశూలకు లోనైన 'చించ' కడుపు మీద నొక్కుకుంటుంటే ఆమె పొట్ట మీద కట్టుకున్న కొయ్యముక్కలు జారిపడతాయి. ఆమె కథ బట్టబయలైంది. ఉదరశూలకు, గాయాలకు భిక్షుకీగణం ఉపచారాలు చేస్తారు.

సిద్ధార్థుని రాణి యశోధర. ఆమె సైతం భిక్షుణిగా ఉంటుంది. బుద్ధుని దర్శనానికి వస్తుంది. ఆ సమయంలో ఆమెకు బుద్ధుడు "పూర్వ నివేశానుస్మృతి" కలిగిస్తాడు. యశోధర తమ పూర్వజన్మ వృత్తాంతాలు కండ్లముందు దర్శించగలిగిందట ! అపూర్వ లావణ్యవతిగా, రాజనర్తకిగా, బింబిసారుని రాణిగా గౌరవాభిమానాలు పొందిన ఆమ్రపాలి ఒంటరిదై, వేశ్యా జీవనం గడుపుతూ ఉంటుంది. వైశాలి నగరంలో ఆమెనందరూ హేళనగా చూసే వారే. అటువంటి ఆమ్రపాలికి భిక్షుణీ దీక్షను ప్రసాదించి సాంత్వన చేకూర్చాడు బుద్ధుడు. వైశాలి నగరంలో లిచ్ఛవీయులను కాదని, ఆమ్రపాలి ఇంట భిక్ష స్వీకరణకే బుద్ధుడు వెళ్ళటం ఒక సంచలనం.

ఈ నవలలో స్త్రీ పాత్రలు : ప్రజాపతి గౌతమి, యశోధర, సుజాత, తృణ గ్రామానికి చెంది, బుద్ధునికి దాహార్తి తీర్చిన పాపానికి యజమాని దెబ్బకు ప్రాణం గోల్పోయిన పేరు తెలియని బాలిక, మిగారుని కోడలు విశాఖ, ఆమ్రపాలి తదితరులందరూ ఉదాత్త మానవీయ పరిమళాలతో శోభిస్తారు.

బౌద్ధమతం స్వీకరించిన పలువురు స్త్రీ పురుషుల కథలు ఈ నవలలో చోటు చేసుకున్నాయి. భారతదేశంలో క్రీ.పూ. 6వ శతాబ్ది నాటి సాంఘిక, రాజకీయ పరిస్థితులు 'మహోదయం'లో సమోదు కావటం విశేషం. తెలుగులో వెలువడిన బౌద్ధ సాహిత్యానికి 'మహోదయం' అదనపు ఆభరణం.

ప్రతులకు: బీనీడి కృష్ణయ్య
3-32, బీనీడి వారి వీధి,
టంగుటూరు-523 274
ప్రకాశం జిల్లా
సెల్: 92472 97790

– డా. తుర్లపాటి రాజేశ్వరి
9078743851



తెలంగాణ స్వతంత్ర్య సాయుధ పోరాటానికి ప్రేరణ నిచ్చిన

దొడ్డి కొమురయ్య అమరత్వం

"అమరజీవి నీవు కొమరయ్య
అందుకో జోహార్లు కొమురయ్య
లంచగొండుల అండ దేశముకులకు ఉండ
న్యాయ రక్షణ కొరకు నడుము బిగించి తిని
గుండాల తుపాకి గుళ్ళకు ఎదురుగా పోరి
బలి అయిన వీరులలో కొమురయ్య
నీ పేరు నిలుపకనే కొమురయ్య
నిద్ర పోము మేము కొమురయ్య"

తెలంగాణ ప్రజల బానిస సంకెళ్ల విముక్తికోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే ఈ నేల మీద సాగిన మహోద్యమం. దొరలు ,దేశ్ముఖ, పటేళ్లు ,పట్వారీలు, దౌర్జన్యాలను రజాకార్ల బీభత్సకాండను, నిజాం నిరంకుశత్వాన్ని, బాంచన్ నీ కాల్మొక్తా అనే బానిసత్వం నుండి సామాన్య ప్రజలు వెట్టిచాకిరి చేస్తున్న వారు "నీ జులుం ఏందిరా" అని తిరగబడ్డారు.

నాటి కరీంనగర్ జిల్లాకు చెందిన బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి ,ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమల వంటి ఎందరో నాయకుల సారధ్యంలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, లెవీ ధాన్యం వసూలుకు నిరసనగా, రజాకార్ల అకృత్యాలకు ప్రతిఘటనగా ఎందరో సాయుధ పోరాట వీరుల ను ఈ ఉద్యమం తయారు చేసినది.

ఈ ఉద్యమంలో తొలి అమరుడు కడివెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య.

దొడ్డి కొమురయ్య అనగానే కడవెండి, కడవెండి అనగానే పోరాటయోధుడు నల్ల నరసింహులు పుట్టిన ఊరు. ఊరి మధ్యలో అమరుడు దొడ్డి కొమురయ్య స్తూపం కడవెండి గ్రామ ప్రదేశంలోనే సాయుధ పోరాట యోధుడు నల్ల నరసింహులు తో పాటు అనేక నాటి నేటి పోరాట రూపాలు దర్శనమిస్తాయి.



అక్కడికి దాదాపుగా పది కిలోమీటర్ల దూరంలో ఆంధ్ర మహాసభ కార్యకర్తగా తన పోరాటంలో గెలిచిన కూడా గుండాల చేతిలో అమరుడైన కామారెడ్డిగూడ కు చెందిన బంధగీ సమాధి కామారెడ్డి గూడచౌరస్తా లో ఉంది.

వీరనారి చాకలి ఐలమ్మ స్వగ్రామం పాలకుర్తి. 60 గ్రామాలకు అధిపతి గా ఉన్న రామచంద్రా రెడ్డి స్వగ్రామం విస్నూరు దగ్గరే.

చరిత్రలో తమకంటూ పోరాట ప్రాధాన్యత లిఖించుకున్న ఈ గ్రామాల్లో అన్నీ కూడా ఒకే ప్రాంగణంలో ఉండటం ఇప్పటికీ ఆ ప్రాంతంలో చైతన్యం కనబడుతూనే ఉండటం గమనించదగినది. తొలి అమరుడు దొడ్డి కొమురయ్య నడయాడిన నేల ఆ గ్రామాలకు వన్నె తెస్తే ఆ ప్రాంతాలలో పర్యటిస్తే తప్పకుండా మనం భావోద్వేగానికి గురి అవుతాము.

నేను 2017 ప్రాంతంలో ఆ ప్రాంతాలను పర్యటించి చారిత్రక వారసత్వాన్ని, పోరాట గాథలను నాటి వ్యక్తుల నుండి సేకరించి కదలాడిన నేలను ముద్దాడి వారి అమరత్వానికి జోహార్లు అర్పించిన అనుభవంతోనే ఈ వ్యాసాన్ని రాస్తున్నాను.

విసునూరు రామచంద్రారెడ్డి తన ప్రాబల్యాన్ని కొనసాగిస్తుంటే తన తల్లి జానమ్మ దొరసానికి బదులు "దొర"అని ప్రజలతో పిలువబడుతూ ప్రజలను నానారకాలుగా పీడించేది. జానమ్మ కడివెండి గ్రామములో ఉంటూ లెవీ ధాన్యాన్ని నిర్బంధంగా వసూలు చేస్తూ వెట్టిచాకిరిని నిర్బంధంగా అమలు చేస్తూ ఎదిరించిన వారిని చంపి తన ఆగడాలను నిరాటంకముగా కొనసాగించింది.

దొడ్డి మల్లయ్య తమ్ముడు దొడ్డి కొమురయ్య అన్నకు ఆసరాగా ఉండి అన్యాయాన్ని ఎదిరించినప్పటికీ జానమ్మ ఆగడాలను భరించలేక దొడ్డి మల్లయ్య ఇస్లాం మతాన్ని స్వీకరించి ఖాదర్ అలీగా పేరు మార్చుకుని నికృష్టంగా బ్రతుక వలసి వచ్చింది.

1944లో భువనగిరిలో జరిగినటువంటి ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో కడవెండి గ్రామంలో ఆంధ్ర మహాసభ గ్రామ శాఖను దామోదర్ రెడ్డి అధ్యక్షతన సమావేశమై ఏర్పాటు చేసుకున్నారు. నల్ల నరసింహులు కార్యదర్శి. ఉద్యమం ఫలితంగా నాటి అధికారులతో జానమ్మ ఆగడాలపై ఒత్తిడి తెచ్చిన కారణంగా గత్యంతరం లేని పరిస్థితుల్లో అధికారులు కడివెండిలో పర్యటించి ప్రజల నుండి జానమ్మ అక్రమంగా సంపాదించిన 80 పూట ధాన్యాన్ని జప్తు చేసి వెళ్ళారు. ఈ అవమాన భారాన్ని అటు రామచంద్రారెడ్డి ఇటు జానమ్మ పట్టుకోలేక పోయింది. ఉద్యమంలో పనిచేసిన కార్యకర్తల పై అక్రమ కేసులు బనాయించి పోలీసులతో అరెస్టు చేయించారు. అప్పటిదాకా సంఘం కార్యకర్తల దగ్గర కర్ర బలమే తప్ప ఆయుధాలు లేవు ఐక్యత వారి ఆయుధం పోరాట స్ఫూర్తి వారికి కొండంత అండ.

సంఘాన్ని విచ్ఛిన్నం చేయాలని విసునూరు రామచంద్రారెడ్డి మామ గడ్డం నరసింహ రెడ్డి నేతృత్వంలో గుండాల ఆధ్వర్యంలో 40 మంది కడవెండి గ్రామంపై జులై 4, 1948న విరుచుకుపడ్డారు. ఈ ప్రమాదాన్ని ముందే పసిగట్టిన ఆర్గనైజర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వందల మందికి పైగా ప్రజలు దౌర్జన్యాన్ని అడ్డుకోవడానికి పెద్ద ఎత్తున ర్యాలీ తీస్తూ ఆంధ్ర మహాసభ, గ్రామ సంఘం వర్ధిల్లాలి, దేశ్ముఖ్ దౌర్జన్యాలు నశించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఊరేగింపు నిర్వహిస్తుండగా దొడ్డి కొమురయ్య తన అన్న దొడ్డి మల్లయ్యతో సహా ఊరేగింపు ముందు వరుసలో నిలిచారు. ఊరేగింపు జానమ్మ గడి దగ్గరికి రాగానే నరసింహారెడ్డి ఎబీబనితిని అలీ అనుచరుల గుండాల జరిపిన కాల్పుల్లో జై ఆంధ్ర మహాసభ అంటూ దొడ్డి కొమరయ్య వీర మరణం చెందారు.

దొడ్డి కొమురయ్య శవాన్ని జనగామ తీసుకెళ్ళి గత్యంతరం లేని పరిస్థితుల్లో కడవెండి గ్రామానికి తీసుకురాలేక నెల్లుట్ల గ్రామం వద్ద పూడ్చి పెట్టారు. కేవలం విసునూరు జాగీర్దార్ హయాంలో జరిగిన ఈ అరాచకం కొమురయ్య అమరత్వం నాటి తెలంగాణ ప్రాంతంలో కొనసాగుతున్న వెట్టిచాకిరి, బానిసత్వ నిర్మూలన కోసం విముక్తి కోసం తెలంగాణ వ్యాప్తంగా మహోద్యమంగా మారింది ఆ ఉద్యమమే తదనంతరకాలంలో 1947 సెప్టెంబర్లో ఆంధ్రమహాసభ కమ్యూనిస్టు రాష్ట్ర నాయకత్వం తెలంగాణ సాయుధ పోరాటంగా పిలుపునివ్వడంతో 1951 వరకు ఈ ఉద్యమం కొనసాగింది.

ఆ ఉద్యమం కొనసాగుతున్న కాలంలో పటేల్ పట్వారీల దోపిడీ నుంచి రజాకార్ల దుర్మార్గం నుండి వందలాది గ్రామాలను విడిపించి భూస్వాముల నుండి నిర్బంధంగా గుంజుకున్న పది లక్షల ఎకరాలను పేద ప్రజానీకానికి పంచిపెట్టి విప్లవోద్యమానికి సార్థకత చేకూర్చిరి.

ఈ ఉద్యమంలో నాలుగు వేల మంది కమ్యూనిస్టు ,ఆంధ్ర మహాసభ కార్యకర్తలు అమరులైనప్పటికీ భూస్వాముల ఆగడాలను నిలువరించడం దేశ చరిత్రలోనే గొప్ప అధ్యాయం.

దొడ్డి కొమురయ్య అమరత్వానికి నేటికీ 75 ఏళ్లు నిండినవి. నాటి ఉద్యమ అవసరాల రీత్యా పేద ప్రజానీకం ఏ రకంగా ఉద్యమంలో చేరి ప్రజల విముక్తి కోసం పనిచేశారో నాటి ఉద్యమ స్థితిగతులను పోరాటపటిమను నేటి యువత అధ్యయనం చేసినట్లయితే నేడు రాష్ట్రంలో దేశంలో కొనసాగుతున్న గడ్డు పరిస్థితులను ఎదిరించడంలో కృతకృత్యుల కాగలము.

దొడ్డి కొమురయ్య నాడు తూటాలకు బలి కావడంతో గ్రామగ్రామాన ఊరూరా ప్రజానీకం ఎగిసిపడింది. నాటి ఆంధ్ర మహాసభ వర్ధంతి 4,జులై 1946గా ఏర్పాటు చేయడానికి పూనుకుంటే దానికి వేలాదిగా అనేక గ్రామాల నుండి పెద్ద ఎత్తున ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ ఊరేగింపులో ఒక్క చోటనే కాకుండా రాష్ట్రమంతటా ఎక్కడికక్కడ భారీ ఎత్తున నిర్వహించబడినవి. రాష్ట్రవ్యాప్తంగా దావానలంలా వ్యాపించిన ఊరేగింపు కథనాలు ఉద్యమ తీవ్రతను పెంచడమే కాకుండా ప్రజానీకానికి ఎక్కడికక్కడ కదిలేలా ప్రోత్సహించింది.

1919లో సూర్యాపేటలో జన్మించిన ఆవుల పిచ్చయ్య ఒక పేద కుటుంబానికి చెందిన వాడు. పెద్దగా చదువుకోకపోయినా అప్పటికీ నాటి సమకాలీన పరిస్థితులను అధ్యయనం చేసి తాను కూడా స్వయంగా తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని 1949 వరకు జైలు శిక్ష అనుభవించాడు.

ఒక రచయితగా, కథకునిగా ఆవుల పిచ్చయ్య తాను పరిశీలించిన అంశాలను దొడ్డి కొమురయ్య అమరత్వాన్ని నాడు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఊరేగింపులను "ఊరేగింపులు "అనే పేరుతో కథ రాసి నేటి తరానికి నాటి అనుభవాలను అందించాడు.

ఆ కథను చదవడం ద్వారా కూడా నాటి సమకాలీన పరిస్థితులు ఎలా ఉండేవి?. దొడ్డి కొమురయ్య అమరత్వం, వీరత్వం, పోరాటం, ప్రతిఘటన మనం, ఈనాటి తరం తెలుసుకోవచ్చు.

అవినీతి అన్యాయం అక్రమార్జన దోపిడీ దౌర్జన్యాలు ఏ కాలంలోనైనా వ్యవస్థలో కొనసాగినప్పుడు పాలకులు ఆ దుర్మార్గానికి పూనుకున్నప్పుడు ప్రజలకు గత్యంతరం లేని పరిస్థితుల్లో పోరాటమే ఏకైక మార్గం. ఈ చారిత్రక సత్యాన్ని 75 సంవత్సరాలకు పూర్వమే నాటితరం అమలు చేసి చూపింది.

మరి నేడు రాష్ట్రంలో దేశంలో ఎన్నో అకృత్యాలు, అసమానతలు, అంతరాలు, వివక్షత కొనసాగుతున్నప్పటికీ ప్రజానీకం స్పందించకపోవడం, పట్టించుకోకపోవడం బాధాకరం. నాటి ఉద్యమంలో పాల్గొన్న వారిలో చాలా మంది నిరక్షరాస్యులే కేవలం 4 శాతం గా ఉన్నటువంటి అక్షరాస్యత ఆనాడు కొనసాగితే నేడు 75 శాతం అక్షరాస్యత ఉన్నప్పటికీ సమకాలీన పరిస్థితుల పట్ల స్పందించక పోవడం విచారకరం ఆ వైపుగా ప్రజానీకం ఉద్యమ శక్తులు ప్రజాసంఘాలు పక్షాలూ ఆలోచించవలసి ఉంది. అప్పుడే మనము దొడ్డి కొమురయ్య అమరత్వానికి నిజమైన నివాళి అర్పించి నట్లు అవుతుంది.

– వడ్డేపల్లి మల్లేశము
9014206412

అశితలు

ఆ॥వె॥ అంతరిక్షపు తొలి, అడుగలేయు శిరీష
బండ్ల వారి ఆడ పడుచువమ్మ
వెలుగు వెలుగుసిరుల తేజోమయూరమా
పిడుగు రాళ్లబిడ్డ పిడుగువీవు

ఘనత నొంది నట్టి గగనవిహారి హెూ
మెట్టు మెట్టు నెక్కి మెరసినట్టి
అంతరిక్షయాని అమెరికా విజ్ఞాని
అందుకొమ్ముమాదు ఆశితులను

–డి. రాములు
94403 76688

విధి

అతనికి చెప్పుల్లేవు
అతనిది చెదిరిపోయిన జుట్టు
నలిగిన, మాసిన వస్త్రాలతనివి
రాళ్ళుగుచ్చుకున్నా
కాళ్ళుకాలుతున్నా
చెత్తయేరితేనే
సంచీలో చెత్త నింపుతేనే
పొట్టనిండేది
నిద్రపట్టేది
అనుకోకుండా
చదువుకునే అవకాశమొచ్చి
పెద్ద చదువరయ్యాడు
పాపం ఆయాసమొచ్చి
ఆశుపత్రిలో చేరితే
కరోనాతో
మనమందరం
నిద్రపోయేచోటుకే వెళ్ళాడు
స్మశానానికి.

– సత్యం
సెల్: 9100495714

ఏమౌతుందోనని..

ఏమౌతుందోనని
అర్థం చేసుకునేలోపు
ఏదో ఒక అనర్థం జరిగిపోతుంది
నిన్న నిక్షేపంగా ఉన్నవారు
నేడు అవశేషంగా మిగిలిపోతే
మొన్న నాతో కలిసి ముచ్చట్లు
చెప్పి హాయిగా గడిపిన వ్యక్తి
మృత్యువురొచ్చులో దిగబడితే,
రాత్రి నవ్వుతూ తుళ్ళుతూ
గడిపినవాడు మరునాడు
మరుభూమికి ఇంధనమౌతున్నాడు..

ఏదో ఊహించనిది
జరుగుతుందేమోనని మనసు
సంశయపడేలోపే ఒకరు
అంపశయ్య మీద ఊపిరికై
జరిగినపోరాటంలో ఆత్మవిశ్వాస
అస్త్రాల్ని త్యజిస్తే,
ఏది జరగకూడదని కలలో కూడా
అనుకోలేదో రాత్రి కల పొద్దునే
చెదరకముందే అతను
జీవితపుకలను చెరిపేసి
ఆయువును తుడిపేసుకున్నాడు..

కాలాన్ని అవగాహన చేసుకునేలోపు
సకలం కకావికలమౌతే,
గతం అవగతమయ్యేలోపు
జీవితపుపుట మెల్లిగా
విగతపర్వములోకి జారిపోతుంది
వర్తమాన గుండెలపై కర్కశత్వం
కరాళనృత్యమాడుతుండే
అది చేసే ఆర్తనాదాలతో
గుండె తరుక్కుపోతుంది..
బంగారు భవిష్యత్తు కళ్లముందరే
కంగారయ్యి దాని సింగారం
నుదుటసింధూరంతో పాటే
చెరిగిపోతుంది..

ఏమౌతుందోనని అర్థం చేసుకునేలోపు
మనసు ఆత్మస్థైర్య కుబుసాన్ని వదిలేసి
భయవిహ్వల దుప్పటిని చుట్టుకుని
మృత్యువు ముంగిట్లో నిస్సత్తువై
జీవనపాళీతో మరణవాంగ్మూలం
వ్రాసేస్తుంది..

–సర్పరాజ్ అన్వర్
9440981198

సంసార నావ

మూడు ముళ్ళతో ఒక్కటైన బంధం
చిక్కు ముళ్ళ సంసార సాగరంలో
ఆటు పోట్లకు అటు ఇటు కదులుచు
చేరుకోవాలి స్థిరమైన గమ్యము.
మనసు అగాధపు లోతులను కొలిచి
అనుక్షణం తప్పొప్పులు బేరీజు వేసుకొని
ఎక్కువ తక్కువ తారతమ్యాలు
ఎంచుకుంటే మిగిలేది వ్యధ!.
జీవిత నావకు ప్రేమ అనే ఇంధనం పోసి
సంసారపు తోటకి అనురాగాల నీరు పట్టి
ఆవేశపు కలుపు మొక్కలను ఏరి పారేస్తే
లాహిరి లాహిరి అంటూ
చల్లగా సాగుతుంది పండు వెన్నెలలో.
పాటకు పల్లవి చరణం ప్రాణమై నట్లే
సంసార నావకు ఆలు మగలే తెర చాపగ
దిక్కు తెలుసుకుని పయనం సాగిస్తే..
సరాగాల సంసారమే!.

నదీదేహం

ఇంటి ముందు అల్లుకున్న
మల్లెతీగ
పచ్చని నవ్వుల్లో నుంచి
రాలిపడ్డ నీటిబొట్లు
నాలో చైతన్య స్ఫురణ కలిగిస్తాయి.

ఇంటబయటా నడిచిన ప్రతీసారి
తీగ జారి
తలనో భుజాన్నో తడిమి
గిలిగింతలు పెడుతుంది.

ఉదయసాయంత్రాల్లో
మొగ్గల పరిమళాలు
కుదేసి లంగరేస్తాయి
నన్నొంటరిగా.

దాని ఊతకర్రను పట్టి
తల పైకెత్తి చూస్తాను -
చిటికెన వేలుపై
పురి విప్పుకుని దర్శనమిస్తుంది
పందిరి గొడుగు.

తన అంతరంగ మదిలో
ఎంత యుద్ధ ప్రక్రియ నడిస్తే గాని
పువ్వుల్ని కాస్తుంది.

భాదలన్నీ తనివి
అనుభూతులన్నీ మనవి.

ఎన్ని నదులను నింపుకున్న దేహమో -
శరీరాన్ని సాగదీస్తూ
ఒక్కో గాయాన్ని కుట్టుకుంటూ
ప్రవాహంగా పాకుతుంది.

-ఇ. రాఘవేంద్ర
9494074022

రిక్త హస్తాలు

మనిషి!
జన్మనెత్తే సమయంలో...
సంపదలెన్ని మోసుకొస్తుంటాడో మరి...
పిడికిళ్లను మాత్రం గట్టిగా మూసి ఉంచుకుంటాడు!

కాటిలో కాల్చి బూడిద చేసే సమయంలో...
తన వెంట ఏం తీసుకెళ్తాననుకుంటాడో మరి...!

ప్రతి రోజూ...
దేనికోసమో విరామమెరుగక పరుగెడుతుంటాడు!

ఎప్పుడో. ..
బంధాలూ బంధుత్వాలకు
తిలోదకాలు ఇచ్చే ఉంటాడు!
అందుకనే...
కాల చక్రపు ఇరుసులో
మరబొమ్మోలే గిరగిరా తిరుగుతూ...
కాసుల గలగలల సుమధుర సంగీతంలో ఓలలాడాలని ...
నోట్ల కట్టల సువాసనలను నిత్యం శ్వాసించాలని ఆశ పడుతుంటాడు!

చివరికి మిగిలేదేమిటని ఆలోచన కలుగునాటికి...
మమతానుబంధాలన్నీ పారదర్శక గాజుగోడ ఆవల ఉండి...
అందినట్లే ఉన్నా అందకుండా ఉండి...
తనను మానసిక ఒంటరిని చేసేస్తాయని గుర్తెరుగదు!
అందుకే ఓ మనిషీ...
రిక్తహస్తములే తొలి తుదులని మరువబోకు!

-వెగ్గలం ఉషశ్రీ
9440370066

అమాయకపు గుట్టన్న కథలు
(పిల్లల హాస్య కథలు)

పెరుగు డబ్బు

గుట్టడు ఒకసారి తన మామ గారి ఇంటికి వెళ్ళాడు .అక్కడ పెరుగు అమ్మే అతను వచ్చి వారింట్లో పెరుగును పోశాడు. గుట్టని మామ తన భార్యతో " ఒసేయ్! పెరుగు వాడికి డబ్బు మొత్తం ఇవ్వకు.మొత్తం వాడికి ఇచ్చావంటే వాడు రేపు రాడు. వాడిని మనం వెతకవలసి వస్తుంది. వాడికి డబ్బు బాకీ ఉంటే ఖచ్చితంగా ఆ బాకీ ఉన్న డబ్బు కోసం అయినా వస్తాడు. అందువల్ల సగం డబ్బులు మాత్రమే ఇవ్వు" అని అన్నాడు .ఆమె సరేనంది.

ఆమె డబ్బును గుట్టనికి ఇచ్చి పెరుగు వానికి ఇవ్వ మంది. గుట్టడు ఆ డబ్బులు తీసుకుని వెళ్ల వాడికి ఇస్తూ "నీకు సగం డబ్బులే ఇస్తున్నాం. మొత్తం ఇస్తే నీవు రేపు రావట .మిగతా డబ్బుల కోసం అయినా తిరిగి రేపు నీవు తప్పకుండా వస్తావని మా మామయ్య చెప్పాడు "అని ఆ డబ్బులు ఇచ్చాడు. పెరుగు వాడు భలేబేరం అంటూ వెళ్ళిపోయాడు.

ఆ మాటలు విని అతని మామయ్య నెత్తి కొట్టుకొని " ఛీ.ఛీ. ఖర్మ . వీడికి డబ్బులు ఎందుకు ఇచ్చావే!నేను నిన్ను ఇమ్మని అన్నాను కానీ వీడిని ఇవ్వమని అనలేదుగా "అని భార్యను కసిరాడు. ఆమె తనను క్షమించమని చెప్పి "మామయ్య అన్న మాటలు ఉన్నది ఉన్నట్టు చెబుతావా! నీకు బుద్ధి లేదా" అని అంది. అప్పుడు గుట్టడు అమాయకంగా "నాకు అబద్ధం చెప్పడం రాదు" అని అన్నాడు. ఆమె తల బాదుకుంది .

-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

హమాలి

అతడు మోస్తున్నది బరువుల
బస్తాల్ని కాదు.
మనందరి ఆకలిని
మనందరి అవసరాల్ని మోస్తున్నాడు.
కండలన్ని కొండల్లా
నరాలన్ని మర్రి ఊడల్లా
అతని దేహం కదులుతోంది
బరువుల బారాలతో.
శివున్ని మోసే నదీశ్వరుడిలా
విష్ణువుని మోసే గరుత్మంతుడిలా
తన పనిలో మునిగిపోయే
కర్మవీరుడతడు.
అతగాడు మోసేది బరువుల్ని కాదు...
తన పరివారపు స్వప్నాల్ని.

అతడి చేయి పడనిదే...
ఏ వస్తువు కదలదు.
తన హస్తాలతో సంతకాల
జాతర జరగాల్సిందే.
వస్తువులన్నింటిని గమ్యాల
బాట పట్టించే "నావ" అతడు.

దేహం అంతా చెమటలు కక్కుతున్న
హృదయంలో బాధలు సుడిగుండాల్లా
తిరుగుతున్నా...
కన్నీరంత కాలువలై ప్రవహించినా
కలత చెందని కష్టజీవి అతడు.
బరువులన్నీ అలవోకగా మోసే
భీముడు అతడు.

పిల్లా పాపలను సాకడానికి
ఏ మంచి కార్యానికి వెనుకాడదు.
మూటల కొద్దీ మనీ రాకపోయినా
పదో పరకో సంపాదించి
రోజుల్ని ఎల్లదీసే ధర్మాత్ముడతడు.
అన్నదాతలు పండించిన అమృతాన్ని
దూరతీరాలకు చేర్చేది ఈ హమాలినే.

అతని మొహం మీద కష్టాల పవనాలు
విస్తూనే ఉంటాయి.
ఎదలో టన్నులకొద్ది సంసార బాధలు
ఎపుడు మోస్తూనే ఉంటాడు.
ఈ బస్తాల బరువు ఓ లెక్కా అతనికి.
నిశ్శబ్దపు చీకటి బతుకుల్లో
వెలుతురులేని లోకాన్ని చూస్తుంటాడు.
అలుపెరుగని కార్మికుడై తన జీవిత
బరువుల్ని మొస్తుంటాడు.

-అశోక్ గోన
9441317361

వినండి ! గజవెల్లి పాటల లొల్లి

కవితాసదస్సు నడుస్తుంది. వేదికమీద తీయని సన్నని కంఠం పాడుతుంది. భావం అందలేదుగాని కంఠం మధురంగా ఉంది. పాటపాడటం ముగిసాక పరిచయం చేసుకున్నాను. ఆయనే గజవెల్లి దశరథరామయ్య. తర్వాత అనేక సాహితీ సదస్సుల్లో కవిసమ్మేళనాల్లో కలుసుకున్నాం. మంచి బావుకత, విషయ పరిశీలన ఉన్నవారు. గొప్ప వాగ్గేయకారుడు. దాదాపు ముప్పయ్యారేళ్ళ నుండి పాటలు రాస్తూ పాడుతున్నా రాసినవన్నీ ఒక పుస్తక రూపంలో తీసుకురాలేదు. నాకన్నా పెద్దవాడైనా నన్ను అన్నా అని సంబోధిస్తూ ప్రేమగా పిలవటంవల్ల మా స్నేహం నిలబడింది. తను వినిపించిన కవితల్లో పేదలు పడుతున్న బాధలు, కార్మికులు, అనుభవిస్తున్న కష్టాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు రాజ్యం చేస్తున్న దుర్మార్గాలు కనిపించేవి. ఎన్నాళ్ళకు ఒక పుస్తకంగా తీసుకురావాలని గతంలో ప్రయత్నించినా అది విఫలమైంది. నేనూ మరికొంత మంది మిత్రులు ముఖ్యంగా తంగిరాల చక్రవర్తి వెంటబడటం వల్ల ఈ పుస్తకం మీ ముందుకు వచ్చింది.

కరీంనగర్‌జిల్లా శనిగరంలో కూరెళ్ళ (గజవెల్లి) వెంకటనర్సయ్య, గజవెల్లి గంగమ్మలకు ఫస్టు ఆగస్టు పందొమ్మిది వందల నలభైయేడు నాడు జన్మించారు గజవెల్లి. కోహెడ్‌లో పెద్ద ఇల్లు దొడ్డి నిండా ఆవులు, గుర్రాలు కలవారి ఇల్లే. కోహెడ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కూరెళ్ళలో కూడా ఒక ఇల్లు ఉండేది. శనిగరంలో రెండు పెద్ద ఇండ్లు. గజవెల్లి ఉన్న కుటుంబంలో పుట్టినప్పటికీ తను ఐదో తరగతి చదువుతున్నప్పుడే వాళ్ళనాన్న చనిపోవడంతో గజవెల్లికి కష్టాలు మొదలయ్యాయి. నల్గురు అన్నదమ్ములు. ముగ్గురు అక్కా చెల్లెళ్ళు పెద్దకుటుంబం. అన్నదమ్ములు నల్గురిలో చిన్నవారు గజవెల్లి. కుటుంబ భారం ఎక్కువవటం, సంపాదన లేకపోవటంవల్ల నాన్న కట్టిన నాల్గిండ్లు పోయాయి. చిన్నప్పుడు నాన్న తొడమీద కూర్చుండపెట్టుకుని భాగవత రామాయణ మహాభారత పద్యాలు నేర్పించాడు. ఇప్పటికీ అరవై డెబ్బై పద్యాలదాకా కంఠస్థమే. నాన్న పాడి వినిపించటం వల్ల గానకళ గజవెల్లికి అబ్బింది.

1963 హెచ్.ఎస్.సి. చదువుతున్నప్పుడే చదువు మధ్యలో ఆగిపోయింది. 1964లో అనంతపూర్‌లో ఎస్.ఎస్.ఎల్.సి. చేసి పాసయ్యారు. 1965లో చిత్తూరులో ఎస్.వి. యూనివర్శిటీలో తెలుగు విద్వాన్ చేశారు. చదువులో ఎన్నో ఇబ్బందులు పడుతున్నా గేయాలు రాయటం, పాడటం ఆపలేదు. ఏదైనా పట్టుదలతో 1967లో చిత్తూరులో ఐ.టి.ఐ చేశారు. ఎట్టకేలకు 1970లో హైదరాబాద్‌లో డి.ఈ.ఓలో టెక్నీషియన్‌గా ఉద్యోగం సాధించారు. ఉద్యోగం చేస్తూనే కమ్యూనిస్టు పార్టీలకు చేరువయ్యారు. సి.పి,ఎమ్., ఎమ్.పి.సి., జి.పి.ఐ. లో మెంబర్లుగా చేరారు. ప్రజానాట్య మండలిలో పనిచేశారు.

1998లో వారు ముద్రించిన గేయ సంకలనంలో మహాకవుల సరసన తన పాటలు అచ్చుకావటం తనకెంతో సంతోషాన్ని కలిగించింది. ప్రజానాట్య మండలిలోనే ఎస్.వి. పరిచయమయ్యారు. ఆయన ప్రోత్సాహంవల్ల మరిన్ని పాటలు రాశారు. వేదికల మీద పాడారు. తను రాసిన గేయాలు వివిధ పత్రికల్లో అచ్చుకావటం తనకెంతో ఉత్సాహాన్ని ప్రోత్సాహాన్ని కలిగించింది. అలా ఇప్పటికీ రాస్తూ పాడుతూనే ఉన్నారు. ఇన్నాళ్ళ తర్వాత మీ ముందుకు వస్తుందీ పుస్తకం 'అక్షర గుళికలు'.

అట్లా పరిచయమైన గజవెల్లి, నేను తనకు ముందుమాట రాస్తానని అనుకోలేదు. సాహిత్యమే సర్వస్వం అని నమ్ముకున్న వ్యక్తికి, అందులో పేదల పట్ల, దీనుల పట్ల అభాగ్యులపట్ల, అనాథలపట్ల ప్రేమ, దయ ఉన్న వ్యక్తిని పరిచయం చేయటమే నా బాధ్యత అనుకుని కొన్ని మాటలు రాస్తున్నాను. ఆయన తన గేయాల్లో స్పృశించకుండా వదిలిపెట్టిన అంశాలు లేవు. ప్రాంతీయ సమస్యల నుండి జాతీయ, అంతర్జాతీయ సమస్యల మీద ఆయన ధిక్కార స్వరం వినిపిస్తుంది.

'రేపటి విప్లవానికి' అనే కవితలో

మతవాదులు తాండవమాడుచుండె దేశమున
పరిపూర్ణతలేని పాలకుల్ పట్టిరి గొడుగులు
భూస్వాములకు దాసోహమనుచు
కరములు ముడిచి కూర్చొను కాలము కాదిది
ప్రజలిక రమ్ముడి లెమ్ముడిక పిడికిళ్ళు బిగియ

అంటూ విప్లవ కవిత్వం రాయగలడు. అంతే అద్భుతంగా ప్రేమ కవిత రాయగలడు. 'ప్రక్రియ వీచిక'లో

'కనులుమూసుకుంటిరా
కనుపాపన నీవేరా
ఎదమాటున దాగి నీవు
సొదపెట్టకురా'

చేయి తిరిగిన కవి గజవెల్లి ప్రతి వస్తువునూ కవిత్వీకరించటంలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు.

అట్లాగే... 'శ్లథ భారతం' లో

'కర్షకవీరుల కాసారానికి
కార్మిక సోదర ఘర్మజలానికి
ఖరీదు కట్టె ప్రపంచబ్యాంకుకు
ప్రణమిల్లె పాలక వర్గం'

అనే కవిత శ్రీశ్రీ కవితకు అనుసరం అయినా ప్రపంచీకరణను దృష్టిలో పెట్టుకుని రాసిన కవిత ఇది.

ఇట్లా డెబ్బైమూడు కవితల్లో, నలభై ఆరు కవితలకు వాటి కింద ఫుట్‌నోట్స్ ఇచ్చారు. వీటిని బట్టిచూస్తే గజవెల్లి గారు చిన్న చిన్న సంఘటనలు మొదలుకొని పెద్దపెద్ద సంగతులన్నీ ఆలోచనాత్మకమైన అవగాహనతో కూడిన కవితలు రాశాడు - 2015లో ఆస్ట్రేలియా గ్రేట్ ఓషన్ చూసిన సందర్భం.

- ప్రపంచీకరణ దృష్టిలో రాసిన కవిత
- ప్రయివేటీకరణకు గురవుతున్న పల్లె ప్రజల కష్టనష్టాలను చూసి రాసిన కవిత.
- గుర్‌గాంలోని మారుతీకార్ల కంపెనీలో పోరాటంచేసే కార్మికులపై పోలీసుల కాల్పులను వ్యతిరేకిస్తూ రాసిన కవిత
- బాబ్రీ మసీదు కూల్చిన సందర్భంగా రాసిన కవిత
- 2005 నగరంలో 18 సెం॥మీ వర్షం కురిసి ప్రజలు ప్రాణాలు కోల్పోయిన సంఘటన మీద రాసిన గేయం.
- శాస్త్రి గారి జై జవాన్ జై కిసాన్ నినాదం విన్న సందర్భంలో రాసిన గీతం
- ప్రభుత్వ పల్లెల్లో అక్షర జ్యోతి కార్యక్రమం నిర్వహించిన రోజుల్లో ప్రజలకు చేయూత నివ్వాలని రాసిన గీతం
- పాలస్తీనా పై ఫాసిస్టులు విసురుతున్న పంజాపై స్పందిస్తూ రాసిన గేయం
- రైతు మరణాలపై జరుగుతున్న అన్యాయాలపై స్పందిస్తూ రాసిన కవిత
- ఇజ్రాయేల్ పాలస్తీనాపై యుద్ధట్యాంకులతో విరుచుకు బడిన సందర్భాన రాసిన గీతం

ఇందులో కొన్ని మాత్రమే ఉటంకించాను. కవి, గాయకుడు గజవెల్లి. నలభైయేండ్లకు పైగా సాహితీ సంఘంలో విశేష అనుభవం ఉన్నది. ఎన్నో సాహితీ సదస్సులలో పాల్గొన్న అనుభూతి ఉన్నది. ఇన్నేళ్ళలో ఇదే తన మొదటి కవితాపుస్తకం. ఇప్పటికైనా తెస్తున్నందుకు అభినందిస్తూ అక్షరగుళికలు అందరి ఆదరాభిమానాలు పొందుతుందని విశ్వసిస్తూ...



ప్రతులకు: గజవెల్లి దశరథ రామయ్య
39-2-70, సాయికృష్ణ ఎన్‌క్లేవ్
బాదంగ్‌పేట, బాలాపూర్ మం॥
రంగారెడ్డి, హైదరాబాద్-500 112.
సెల్: 8985754016

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

ఈనెల 20న సాహితీ అకాడమీ తొలి ఛైర్మన్ డా॥నందిని సిధారెడ్డి ఆవిష్కరించనున్న గజవెల్లి దశరథ రామయ్య గేయ కవితా సంపుటి "అక్షర గుళికలు" పుస్తకానికి కందుకూరి శ్రీరాములు రాసిన ముందు మాట ఇది..

నాన్న

ప్రపంచాన్ని
మనకు పరిచయం చేసినా
మన ప్రపంచంలో పోటుతేక
అనామకుడిలా మిగిలిపోయిన
అమాయకుడు నాన్న.

తన భుజాలమీద నుండి
మనల్ని శిఖరాలకి ఎక్కించినా
తను మాత్రం నేలమీదే మిగిలిపోయే
అసమర్థుడు నాన్న.

చిన్నప్పుడు గాఢ నిద్రలో
పాడు కలలేవి మన దరిచేరకుండా
కళ్ళ బయట కాపలా కాసే
నమ్మిన గూర్ఖా నాన్న.

పెద్దయ్యాక మనం కన్న
బరువైన కలలను
ఇష్టంగా భుజాలపై మోసే
చవకైన కూలీ నాన్న.

లోకంతో రోజూ యుద్ధం చేసి
గెలిచివస్తున్నా
ఇంట్లో మనతో
యుద్ధంలో చిత్తుగా ఓడిపోయే
నిస్సహాయ సైనికుడు నాన్న

పది అవతారాలు ఎత్తినవాడే
పరమాత్ముడైతే
వేయి అవతారాలు ఎత్తిన నాన్నను
ఏమని పిలవాలి

ఒక్క పూట విషం తాగిన వాడే
పరమేశ్వరుడైతే
రోజూ విషం తాగుతున్న నాన్నను
ఏ విధంగా కొలవాలి.

మనకు అన్నీ అమర్చిపెట్టే అవసరం నాన్న
మన ప్రతి కష్టాన్ని గుర్తించే అనుభవం నాన్న

అయినా నాన్న మాట ఎప్పుడూ
మనకు చిరాకు తెప్పిస్తుంటుంది
నాన్న అనుభవం ఎప్పుడూ
మనకు అవుట్ డేటెడ్‌లా తోస్తుంది
నాన్న మనకు ఇప్పుడు సర్టిఫికెట్స్‌పై
పేరులా మిగిలిపోయాడు
మన అవసరాలను తీర్చే
కరెన్సీ నోటులా మారిపోయాడు
మన జీవిత నాటకరంగంలో
సైడ్ కారెక్టర్ నాన్న
మన జీవిత పుస్తకంలో
ఎవరమూ అర్థం చేసుకోని
అద్భుతవాక్యం నాన్న.

మన నల్లటి కళ్లపై
రంగుల కలలను చల్లి
మన జీవన చిత్రాన్ని గీసి
పేరు రాసుకోని చిత్రకారుడు నాన్న.

చెమట చుక్కల మధ్య వెలిగిన
నిండు చంద్రుడు నాన్న
కళ్ళు తెరిచి నేరుగా చూడలేని
ప్రజ్వరిల్లే చల్లని సూర్యుడు నాన్న

-డి.క్రాంతి కుమార్
7396721108

చౌరస్తాలో చెట్టు

చౌరస్తా
తన కనుసన్నల్లోనే ఉందన్న దర్పం
తన ఆధీనంలోనే నడక
సాగిస్తోందన్న గర్వం
దాని సొంతం!
ఏడు పదుల వయసులోనూ
నవయవ్వన సౌందర్యం దాని ప్రాప్తం!
స్వతంత్ర భారతమంత చరిత్ర
దాని గతం!.
లేకపోతే మరేమిటి!?
ఈ చెట్టు...
ఎన్ని ధర్నాలకు వేదికైంది!
ఎన్ని నిరాహార దీక్షలకు నీడైంది!
ఎన్ని ఉద్యమాలకు సాక్ష్యమైంది!.
.పనులపై పట్నమొచ్చిన
పల్లె జనం పిచ్చాపాటిలో
చెట్ల నీడనే మరచిపోతున్న
పట్నవాసుల పరవశంలో
పునీతమైన అనుబంధం
దాని 'మానవ సంబంధం!'.
పిచ్చుకలూ కాకులు
చిలుకలూ కోయిలలూ
అన్నింటినీ సాకిన అనురాగబంధం
దాని 'మాతృసంబంధం!'.
.ఇప్పుడు...
చౌరస్తాలో చెట్టు లేదు
దాని నీడ లేదు
ఇకపై ఉండదు కూడా!
మనసే లేని మనుషుల మధ్య
నవనాగరిక నిర్మాణాల మధ్య
ఇక నిలబడలేనంటూ
నిట్ట నిలువునా కూలిపోయింది
దారికి అడ్డంగా ఒదిగిపోయింది...
వేలాది వీరులు రాస్తారోకో చేస్తున్నట్లు!.
ఉద్యమకారుడి శవయాత్రలా
క్షణాల్లోనే జనప్రభంజనం!
ఎన్ని వందల ఆకులు రాలిపోయాయో
అన్ని వందల నేస్తాలు వాలిపోయారు
కొందరు ప్రేమగా నిమురుతూ!
మరికొందరు జాలిగా తడుముతూ!
ఇంకొందరు వడివడిగా దాటుతూ!
చెట్టు మాత్రం అలాగే...
మరణశయ్యపై భీష్ముడు
మహాప్రస్థానానికై ఎదురు చూస్తున్నట్లు!.
తనవాళ్ళెవరో తెలియని జీవితంలో
అందర్నీ తన వాళ్ళను చేసుకుంది! .
ప్రాథమిక దర్యాప్తు లేదు
పంచనామా అసలే లేదు
చివరి చూపుల కన్నీటి వీడ్కోల్లో
అంత్యక్రియలు మొదలయ్యాయి
కొమ్మలు కొమ్మలుగా...
ముక్కలు ముక్కలుగా...
మొద్దులు మొద్దులుగా...!
అంతా మన అజ్ఞానం కానీ...
చెట్టు పోయినా
దాని జ్ఞాపకాలు పోతాయా!?
త్యాగం నుండి త్యాగంలోకి ప్రయాణించే
దాని జీవనమూ...
జీవనతత్వమూ పోతుందా!?
చచ్చి ఏం సాధించావని అడగకండి
చచ్చీ బ్రతకడం దాని నైజం!

-డాక్టర్ మస్నా వెంకటేశ్వర్లు
8897972070

పుస్తక సమీక్ష

మనసులను కదిలించే మధుకర్ కథలు..

"కథ" అనే శబ్దానికి.. "చెప్పబడేది" అనే అర్థం ఉంది. చెప్పటం ఎంత హృద్యంగా ఉంటే.. ఆ కథ అంత "మంచి కథ" అవుతుంది. సాలీడు గూడు అల్లినట్లు.. ఒక మంచి సన్నివేశం చుట్టూనో.. లేదా ఓ మంచి సమస్య చుట్టూనో.. కథను అల్లడం, దానిని రక్తి కట్టించడం కథకుని నేర్పరితనంపై ఆధారపడి ఉంటుంది. అంతటి నేర్పరితనం, ప్రతిభా వ్యుత్పత్తులను కొన్నింటినైనా సొంతం చేసుకున్న కవి, రచయిత, పాత్రికేయుడు.. మధుకర్ వైద్యులగారు "నువద్ది" పేరుతో ఓ కథా సంపుటిని వెలువరించారు. పాత్రికేయునిగా సమాజంతో మమేకమైన మధుకర్‌గారు తన అనుభవాన్ని.. లోక పరిశీలనా పటిమను రంగరించి.. ఇందలి 17 కథలను రాశారు. ఈ కథల్లో జీవం ఉంది. జీవితముంది. అన్నింటికి మించి కథా రచయిత మధుకర్ గారికి ఉన్న సామాజిక బాధ్యతను ప్రతిబింబించేలా కథలకు రూపమిచ్చారు. కథల కోసం ఎంపిక చేసుకున్న వస్తువుల్లో వైవిధ్యం లేకపోయిన్నప్ప టికీ, ప్రపంచీకరణ నేపథ్యంలో పల్లెలు ధ్వంసమైపోతున్న తీరుకు..మసకబారుతున్న మానవ సంబంధాలకు మరియు 'ప్రేమ' అంశాలకు పెద్దపీట వేశారు. సింగరేణి ప్రాంతం నుండి వచ్చిన రచయిత మధుకర్‌గారు.. తన కథల్లో వీలున్న చోటల్లా గ్రామీణ చిత్రణ చేసి వెప్పించారు.పల్లెల్లోని స్నేహ సంబంధం.. ప్రేమ పూర్వక అనుబంధాలను.. మట్టి వాసనలను తమ కథల్లో ప్రతిఫలింపజేశారు. కొన్నికథల్లో బిగువు కొరవడి నప్పటికీ.. సామాజిక.. కోణంతో.. సమాజ చైతన్యం కోసం ఆయనకు ఉన్న మక్కువను అభినందించి తీరుతాం.

కథా సంపుటికి నిర్ణయించిన 'నువద్ది" పేరు బాగుంది. బంగారు బ్రహ్మాంగారు గీసిన ముఖచిత్రం ప్రత్యేకార్షణగా నిలిచేలా ఉంది.

ఆయా కథల్లో గ్రామీణ భారతాన్ని.. పల్లెల్లో ఉండే పద్ధతులను చక్కగా ఆవిష్కరించారు. మధుకర్‌గారు తన పాత్రికేయ వృత్తిలో పొందిన అనుభవాలు.. అనుభవించిన సంఘర్షణలను.. అనుభూతులను.. ఆయా కథల్లో సందర్భోచితంగా జొప్పించి మెప్పించారు. ఇందలి చాలా కథలు ఏకబిగిన చదవాడనిఇక యోగ్యంగా ఉన్నాయి. కొన్ని కథలు మసకబారుతున్న మానవ సంబంధాలకు మెరుగులు అద్దేలా ఉన్నాయి.

'ప్రేమ ఎంత మధురం.." కథలో మధుకర్‌గారు పదబంధ ప్రయోగంలో కొంత సంయమనం కోల్పోయినప్పటికీ.. రమణీయ భావాలను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. ఈ కథలో శృంగారం శృతిమించి రాగాన పడినప్పటికీ.. కథలోని సన్నివేశానికి రచయిత న్యాయం చేశారన్న తబప్తితో పాఠకులు సర్దుకుపోతారు.

పెళ్లయిన కొత్తలో సహజంగా దంపతులు పెట్టుకునే చెక్కిలింతలను పాఠకులకు గిలిగింతలు పెట్టేలా ఈ కథలో రచయిత తన రసజ్ఞతను ప్రదర్శించారు. ప్రేమ ఎంత మధురమైందో ఈ కథలోని శైలజ.. ధర్మల పాత్రల ద్వారా దృశ్యమానం చేసి చూపారు.

''మా ఊరి జాడేది'' కథలో.. ప్రపంచీకరణ నేపథ్యంలో.. పల్లెలు చిల్లం కల్లం అవుతున్న పరిస్థితులకు అద్దం పట్టారు. గ్రానైట్, కంకర కోసం క్రషర్లు పెట్టి గుట్టలను కరిగించడం వల్ల పల్లెలు ఎలా బోసిపోతున్నాయో.. ఈ కథలోని సన్నివేశాల ద్వారా చక్కగా ప్రస్తావించారు. చెట్టు, పుట్ట, గూడును నామరూపాలు లేకుండా చేస్తున్న స్వార్థపరుల భరతం ఎలా పట్టాలో ఆలోచన రెక్కిత్తించేలా రచనను కొనసాగించారు. చిన్నపాటి జ్ఞాపకాలు.. ఒకప్పటి పల్లెల్లోని అరుగులన్నీ చిన్నబోయిన ప్రస్తుత వైనాన్ని ఆర్థంగా ఆవిష్కరించారు. చిన్నప్పుడు చేసు చెలకల్లో పొందిన అననుభవాలను.. అనుభూతులను ఇందలి ఆయా పాత్రల ద్వారా తెలియజెప్పారు. పల్లెలకున్న ప్రయాణ సౌకర్యాలు.. పల్లెల్లోని చిన్ననాటి స్నేహితుల మధ్య ఉన్న అనుబంధాలను.. అమ్మమ్మ ఇంట్లో పొందే ఆప్యాయతలను ఒక్కసారి పాఠకులందరి మనో ఫలకాలపై నర్తించేలా ఈ కథను చక్కగా తీర్చిదిద్దారు.

"అందమైన విధ్వంసం" కథలో.. తొలి సింగరేణి ఉపరితల గని ఓపీసీ-1ను ప్రస్తావించిన తీరు బాగుంది. 'యైటింక్లయిన్ కాలనీ' పరిసర ప్రాంతాల్లోని పల్లెల్లో బాల్యంలో పొందిన జ్ఞాపకాలను నెమరేసుకు న్నారు. ప్రస్తుత పెద్దపల్లి జిల్లా 'యైటింక్లయిన్ కాలనీ' ఎలా మారిపోయిందో ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు. ఆనాటి స్కూల్ ఈ రోజు ఎలా బోసిపోయిందో తెలియజెప్పారు. ఒకప్పుడు ఆ కాలనీలో ఇరవై దాకా ప్రైవేటు బడులుంటే.. తెలుగు మీద ప్రేమ తగ్గి.. ఇంగ్లీష్ దాకా ప్రైవేటు బడులుంటే.. తెలుగు మీద ప్రేమ తగ్గి.. ఇంగ్లీష్ మీద మోజు ఎలా పెరిగిందో రచయిత ప్రస్తావించిన తీరు బాగుంది. ఒకప్పటి వాగులు.. వంకలు.. ఎండిపోయిన అంశాలను కథల్లో జొప్పించడంలో.. వాస్తవాలకు అద్దం పట్టడంలో ముఖ్యంగా పల్లెలు ధ్వంసమై.. మానవ మనుగడకే.. ప్రమాదం వచ్చిన సంగతినీ.. ఓపెన్ కాస్ట్ వల్ల జరిగే జీవన విధ్వాంసాన్ని కప్పి పుచ్చేందుకు.. మోడల్ కాలనీల పేరుతో సాగిపోతున్న అభివృద్ధి తెరల్ని చించేయాలని పిలుపునిచ్చిన తీరు బాగుంది.

"క్షణికావేశం" కథను చక్కని శిల్పంతో.. ఔచిత్యవంతమైన పదబంధ ప్రయోగంతో.. చక్కని భావుకతతో తీర్చిదిద్దారు.

'చదువుల వ్యాపారం' కథలో నేటి కార్పొరేట్ విద్యాసంస్థల పనితీరును ఎండగట్టారు.

ఈ కథలో.. హాస్టల్ వార్డెన్ సదానందం పాత్ర ఉన్నతంగా చిత్రించబడింది. విద్యార్థి మనోజ్ పాత్రను చూస్తే జాలేసింది. 'తాత పూనిండు కథ'లో మానసిక వైకల్యాన్ని కాస్తంత ఘాటుగానే ప్రస్తావించారు. కొంచెం.. హాస్యం.. జోడించి కథను బ్యాలెన్స్ చేయడంలో.. రచయిత సఫలీకృతులైనారు.

జీవన సంధ్యలో పెద్దలకు పిల్లలెప్పుడూ భారం కాదన్న సంగతిని రుజువు చేసేలా.. 'అమ్మ కావాలి' కథను తీర్చిదిద్దారు.

'ఆడజన్మకు ఎన్నికష్టాలో'' కథలో 'ప్రమీల' ఆత్మహత్య.. అలా దారి తీసిన పరిస్థితులు అందరినీ కదిలిస్తాయి. ఈ కథలో బాధ్యాతాయుతమైన పాత్రికేయుణ్ణి, ఉపాధ్యాయుణ్ణి.. మనసున్న మహారాజును చూస్తాం. కథా గమనం విషయంలో రచయిత మధుకర్‌గారు చూపిన శ్రద్ధ ప్రశంసనీయం..

'ప్రాయశ్చితం' కథలో ఓ తండ్రి కన్నీటి గాథను చూడగలం.. తోటివారిని ఆదుకోవాలన్న మానవత్వం ప్రదర్శించే వ్యక్తినీ వీక్షించగలం.

తెలిసీ తెలియని వయసులో.. యువతీ యువకులు ప్రేమ వలలో చిక్కుకుని.. అనుభవించే బాధమయ గాథలను పొందుపరుస్తూ రాసిన కథలు ఇందులో ఉన్నాయి.

'ప్రేమిస్తే' కథలో ఓ పిచ్చివాడి ప్రేమ కథకు చోటు కల్పించారు. ఈ కథలో ప్రేమ విఫలమైన రాజేశ్ పాత్రను చూస్తే జాలేస్తుంది. ఒక లేత గులాబీ పూర్తిగా విచ్చుకోకుండానే రాలిపోతే ఎలా ఉంటుంది? ఒక మల్లెతీగ మొగ్గకు నోచుకోకముందే వాడిపోతే ఎలా ఉంటుంది? ఈ కథలోని సుప్రియ జీవితంలో అదే జరిగిన విషయాన్ని మధుకర్‌గారు ఆర్థంగా ఆవిష్కరించారు. బంగారు భవిష్యత్ ఉన్న ఒక సరస్వతీ పుత్రుడు రాజేశ్ తెలిసీ తెలియని వయసులో ప్రేమలో పడి.. ఎలా పిచ్చివాడయ్యాడో కథ చదువుతున్నంత సేపు కళ్లు చెమ్మగిల్లేలా రచయిత రచనను కొనసాగించారు. 'ప్రేమే నేరమౌనా...?'' కథలోనూ ధర్మతేజ్ పాత్రను చక్కగా నడిపించారు.

'పరువు హత్య' కథలో తాను రాజకీయ నాయకునిగా ఎదగాలనుకున్న చందన్‌రావు.. పరువుకు పోయి జైలుకెళ్లడం.. ప్రేమికులు వారి కోరిక ఫలించకుండానే మృత్యుఒడికి చేయడం అందరినీ కదిలించేలా ఉన్నాయి. ఒక్కగానొక్క కొడుకుపోయి.. కుమారస్వామి దంపతులు కన్నకూతుర్ని కోల్పోయిన అనిత తల్లిదండ్రుల బాదను చూస్తే.. మన గుండెలు తరుక్కుపోతాయి.

ఇలా.. ఇందులోని కథలను.. కథా సన్నివేశాలను.. సంఘటనలను.. పాత్రలు.. పాత్రల మధ్య సంభాషణలకు జీవం పోయడంలో కథా రచయిత చాలా వరకు సఫలీకృతులైనారు.

మధుకర్‌గారు మున్ముందు వస్తు ఎంపికలో వైవిధ్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 268వ రోజు 'పరీక్ష' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'పరీక్ష' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. – సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

అంతరాత్మతో గెలవాలి..

నేనేమిటో తెలుసుకోవాలి
నా ప్రవర్తనలోని లోపాలు తెలియాలి
నామాటతో ఎదుటివారిలో కలిగే
భావోద్వేగాలు అవగతమవ్వాలి.
నా బాధ్యత లేమిటో
నేను మోయాల్సిన బరువులెవ్వో
నేనెక్కడ తగ్గాలో
ఎక్కడ హెచ్చాలో
ఎవరితో ఎలా నడవాలో
ఎవరికి దూరం జరగాలో
ఎక్కడ నిజం పలకాలో
ఏ అబద్ధాన్ని దాయాలో.
ఎక్కడ కఠినంగా ఉండాలో
ఎందుకు సౌమ్యం పాటించాలో
ఆత్మీయులెవరో
అణగదొక్కేదెవరో
నాలో అహమెంతో
నాకున్న గర్వమెంతో
తెలుసుకోవాలి
నేనేంటో మొదట నాకైతే తెలియాలి.
సాగరాన్ని చిలికినట్టు
అంబరాన్ని శోధించినట్టు
సీతమ్మ అగ్ని ప్రవేశం చేసినట్టు
నాకు నేనే ప్రతి విషయంలో
పరీక్షించుకోవాలి
నిష్పక్షపాతంగా ఫలితాలను
బేరీజు వేసుకోవాలి
మంచి వ్యక్తి గా మారేందుకు
మళ్ళీమళ్ళీ ఇలాంటి పరీక్షలు
జరుపుకుంటూనే ఉండాలి.
ఎప్పటికప్పుడు అంతరాత్మ
వేలెత్తి చూపనట్లు
ప్రతి సారీ పరీక్షల్లో గెలవాలి
నేనూ మనిషిననే భావం
మనస్ఫూర్తిగా కలిగేంతవరకూ
పరీక్షించుకుంటూనే ఉండాలి..



– గుర్రాల వేంకటేశ్వర్లు,
94909 18014

బతుకు పరీక్ష

ఆనాడు ఎదుర్కొంది
సీతమ్మ– అగ్నిపరీక్ష
ఏ క్షణం ఏమవుతుందో తెలియని
సాగుతున్న జీవన యాత్రలో
రోజూ పరీక్షే
దిన దిన గండం నూరేళ్ల ఆయుష్షు!!.
ప్రకృతి పెట్టే పరీక్షలో
ప్రపంచమంతా నలుగుతున్న వైనం
వైభవం తప్పిన జీవన విధానం!!.
ఏరోజుకారోజు వల్లెవేసే పాఠాలు
పరీక్షకు నోచుకోని విద్యార్థులు
అంతర్జాల మాయాజాలం
భవిష్యత్తు అగమ్యగోచరం!!.
ఎన్నో సవాళ్లు
జవాబు లేని ప్రశ్నలు
ఏమౌనో భవిష్యత్ కార్యాచరణ
ఎవరికెవరో
పయనమెటో
ప్రశ్నార్థకం
బతుకుపయనం!!.

–డా.చీదెళ్ళ సీతాలక్ష్మి,
9490367383

కాదు శిక్ష!

పరీక్ష కాదు శిక్ష!
దీక్ష దక్షత ఓర్పు
సహనానికి గీటురాయి!
పరీక్షలేకుంటే చలనం
చైతన్యం శూన్యం!
మనిషికీ శిలకీ భేదం ?
బుర్ర పదునెక్కి ఆశ చిగిర్చి
తపన రగిల్చే పరీక్ష!
సానపడితేనే వజ్రం!.
మన్నుతిన్న పాములా ఉంటే
మనుజ జన్మ కి అర్థం, పరమార్థం??
జమదగ్ని పరీక్ష లో నెగ్గిన పరశురాముడు!
మాతృ పితృ భక్తి చాటినధీరుడు!
శివ ధనుస్సు పరీక్ష సీతాకల్యాణం!

పరీక్షించుకో

మనం చేసే ప్రతిపనిని
మనమే పరీక్షంచుకోవాలి
ఎవరో వస్తారని ఏదో చేస్తారని
ఎవరూ రారని
మనల్ని ఏమి చేయరని
మనం చేసే పనులక్రమం
జరుపగూడదు
జరిపించగూడదు.
పరీక్ష అంటే పిల్లల చదువులో
ప్రభుత్వం పెట్టే పరీక్షలే కాదు
మనం చేసే ప్రతిపనీ పరీక్షయే
చేసేది తప్పా ఒప్పా అనే విషయం
మనమే స్వయంగా పరీక్షించుకోవాలి.
ఇవికాకుండా
పిల్లలు పెట్టే పరీక్ష
బంధువులు మనకుపెట్టే పరీక్ష
ఇరుగుపొరుగువారి పరీక్ష
వృత్తిలో ఎదుర్కొనే పరీక్షలు
సమాజంలో వివిధరకాల పరీక్షలు
అన్నీ పరీక్షలే..
అంతా పరీక్షయే
పరీక్షలన్నీ
జీవితవలయంలో ఎదుర్కోవాలి..
విజయం సాధించాలి.



–తాతపూడి సోమశేఖర శర్మ,
8328079336

సంస్కారం

అదే పెద్ద అగ్ని పరీక్ష
అసలైన కొలబద్ద
నిన్ను నువ్వు చూపించే తీరుకు
నిలబెట్టుకోగలిగేందుకు
బేరసారాలు లేని వస్తువు
బేరీజు మాత్రమే గలది.
సుసంస్కారానికి
కుసంస్కారానికి
ఒక్క అక్షర వ్యత్యాసమే
కనిపెట్టి మసలుకోలేనినాడు
వ్యర్థ జీవితమేగా
పై పై మెరుగులద్దిన సంస్కారం నేర్పకు
నేర్పకు అశాశ్వతాలు.
నిల్పుతాయా నిన్నవి
శాశ్వతకీర్తి సౌధంపై
పుట్టుకతోనూ పెంపకంలోనూ
స్వతహాగానూ
ఇన్ని మార్గాల్లో
సంస్కారాన్ని నమ్మిన వారికి
సమ్మెటపోట్లు తప్పవుగాక తప్పవు.

–ఉండవిల్లి సుజాతా మూర్తి,
74166 05529

సీత అగ్నిప్రవేశం
పునీత పావనచరితం!
ద్రోణుని విలువిద్య పరీక్ష
విజయుని జయకేతనం!
మత్స్య యంత్ర ఛేదనం
పాండవుల పరిణయం!
యక్షప్రశ్నలలో ధర్మ రాజు
ధర్మదేవత ఎదుట అజేయుడు!
గురుదక్షిణ కై ఉదంకుని ఆరాటం!
గురుభక్తికి నిదర్శనం!.
శాస్త్రవేత్తల పరిశోధనలు
ఆధునిక సౌకర్యాలు!
ఏడాది పొడుగుతా చదువు
చిత్రిక పట్టే పరీక్షలు
వెలువడే సానబెట్టిన వజ్రాలు!
పరీక్షలు ఉంటే బుర్రపాదరసం!
వదులు మత్తు మాంద్యం.
మనల్ని మనం వేసుకొనే బేరీజు!
ఆలోచనలు ఆశయాలు
కార్యరూపం దాల్చాలంటే
కష్ట నష్టాలు
ధక్కామొక్కీలు
బంగారానికి సుత్తిదెబ్బ
పుటంలో కాలక తప్పదు!
పరీక్షలు కాదు శిక్ష
బంగరుభావికి శ్రీరామ రక్ష!

–ఎ.రాజ్యశ్రీ,
8985035283

ఆశ

బాల్యంలో ఎన్నో రకాల పరీక్షలు
నెగ్గితేనే జీవిత ఉన్నతి
ఎన్నో రకాల పరీక్షలు రాసి
విజయం సాధిస్తేనే పురోగతి.
చిన్నప్పటి నుంచి
ఆంక్షలు ఆకాంక్షల్ని ఎదుర్కొని
విజయాన్ని పరీక్షలో పొంది
మంచి ఉద్యోగం పొందడం
జీవిత ధ్యేయం.
అలా అలా ఎదిగాక
ఉద్యోగం లో మరెన్నో పరీక్షలు
జీవితంలో ఎన్నో పరీక్షలు
ప్రతిదీ పాస్ కావాలన్న ఆశ.
విద్య, ఉద్యోగమే కాదు–
మనిషికి ప్రతిదీ పరీక్షే
పెళ్లి, పిల్లలు, ప్రమోషన్,
బాధ్యతలు లేని వృద్ధాప్యం–
అన్ని పరీక్షలే!!.

– నారుమంచి వాణీ ప్రభాకరి,
9849481823

ఓపికే పెద్ద పరీక్ష

జీవన సాగరంలో అన్నీ పరీక్షలే
పరీక్షలన్నీ ఎదుర్కోవలసిందే
జీవన సాగరం ఈదాల్సిందే
అభ్యసన స్థాయిలను లెక్కించేవి పరీక్షలే
ఉద్యోగుల ఎంపికకు పరీక్షలే
పదోన్నతులకు పరీక్షలే
రోగ నిర్ధారణకు పరీక్షలే
వాయు కాలుష్య
నిర్ధారణకూ పరీక్షలే
నీటి పరీక్ష
మాట పరీక్ష
వాహన లైసెన్సుకు పరీక్ష
ఇన్సురెన్సు రంగాలలోనూ
బ్యాంకింగ్ రంగాలలోనూ
ఏజెంట్ల నియామకానికి పరీక్ష
సీతకు సైతం తప్పలేదు అగ్ని పరీక్ష
మానవ మాత్రులం మనమెంత
అన్నింటికన్నా
ఓపికే ఒక పెద్ద పరీక్ష
ఓపికగా ఉన్నామంటే
మనస్సును నియంత్రించామంటే
చక్కని సాధనతో
అన్ని పరీక్షలు ఎదుర్కోవచ్చు
హాయిగా జీవితం గడిపేయొచ్చు.

–గుండం మోహన్ రెడ్డి,
9440161636

జీవన పరీక్ష

పల్లవి: ఆనంద జగతిలో
జీవనమే నిలిచెను
పట్టుదల విడవక
పరీక్షలే పెట్టెను.
చరణం 1 : ఆటపాటల జీవనమే
హాయి నింపును మనలోనే
ఒడిదొడుకుల తో జీవితమే
కృంగి పోవును నా మనసే
హృదయ స్పందన నిలువ లేక
జీవన పరీక్షలో పాసవ్వాలి ॥ ఆనంద॥.
చరణం 2: కలల ప్రపంచమే నిలిచే
కంటిలో కులుకు రాకనే
మదిలో ఆశలు పండక పోతే
ఆశయాలు నిలిచిపోయే
పరీక్షతో జీవితమే
దైవ ప్రార్థన జేశామూ ॥ ఆనంద॥.

–వి.సంధ్యా రాణి,
9542299500

ఒప్పు-తప్పు

ప్రతి మనిషి పుట్టుక
ఓ...పరీక్ష
జీవితాంతం పరీక్షలే
తప్పవు ఇంద్రుడికీ చంద్రుడికీ
జీవితమనే పయనంలో
జగత్తు పరీక్షా కేంద్రం
ఉదయం నుంచి రాత్రి నిద్రపోయేదాక
సవాలక్ష ప్రశ్నలు
పరుగుల బతుకు
ఊపిరి సలపని జారుడు మెట్లు
ఒక్కసారి ఎక్కాలి
మరొకసారి జారాలి
భయపడకు
భావిజీవితానికి మంచి ఆశించి
ధైర్యం పుంజుకో
మనస్సు వాకిట నిల్చే
కోరికలు కోకొల్లలు!
ఆ జవాబు పత్రం నింపేది నువ్వే
మంచి రీతి నీతి
బంధాలు అనుబంధాల చిక్కులెన్నో
వాటి గెలుపులకు దేవుడే ఇన్విజిలేటర్
మార్కులు, రిమార్కులు వేసేది
విధాత బ్రహ్మ
ఫలితాలు అతని చేతి రాతలు
గెలిస్తే హాయిగా నవ్వుకో
ఓడిపోతే ఏడుస్తూ కూర్చుకు
మళ్ళీ మనస్సుని జ్ఞాన కలంతో సరిదిద్దుకో
పరీక్ష ఒక జీవిత యుద్ధం
దానికి మన మనస్సే ఓ శత్రువు
ఆశలకు ఆజ్యంవేసి
తరువాత ఛాలెంజ్ చేస్తుంది
ఓటమిలో ఓర్పు ఓదార్పులు ఉండాలి
అంతా సమస్యల భయోద్విగ్న క్షణాలు
ఒంటరి తనం బీదతనం
ఘ్రమలు దుస్స్వప్నాలు
తెలివిగా ఉన్న జ్ఞానంతో శాంతి నిల్పుకో
ప్రశాతంగా ఊపిరిపీల్చి
నేర్పుగా సాగిపో....!.

– ప్రభాశాస్త్రి జోశ్యుల,
7349392037

అంతా పరీక్షే

పుణ్యానికి
పాపానికి
నేర్చిన నడకకు
పుట్టిన జన్మకు
దైవం తూకం వేస్తుంది
విలువను బట్టి
కర్మను నిర్ణయిస్తుంది
ఇదేకదా దైవ పరీక్ష
చదివిన చదువుకు
నైపుణ్య బిగువుకు
రేపటి తరగతి ఉత్తీర్ణతకు
పెట్టాల్సింది పరీక్షేగా.
మార్కుల కోసం
విద్యా వ్యాపారం కోసం
శుష్కింప చేసి
బందీ చేసి
పరీక్ష పేరుతో
శిక్ష వేస్తే
కాదది పరీక్ష
విద్యార్థికి ఉరిశిక్ష.
ప్రతీది పరీక్షే
నవ్వటం ఒక పరీక్షే
పాఠాలు చెప్పే
మాస్టారును చూసి
నవ్వు ఆపుకోవడం పరీక్షే
ఏడవడం పరీక్షే
శవం ముందు
కన్నీరు కార్చని
కన్నుకు పరీక్షే
ముస్తాబై
సిగ్గుతో నిండిపోయి
ముడుచుకు పోయి
పెళ్లి చూపుల్లో
అమ్మాయిని
పాట పాడమన్నప్పుడు
పరీక్షే...
కర్మ ఫలం
జీవితానికి పరీక్షే.

–జె.నరసింహా రావు,
9490128690

ప్రాణదాతలు పుట్టాలి

రోగాన్ని మందులతో తగ్గించే ఆసుపత్రులు పోయి
జబ్బును డబ్బుతో కొలిచే
"కాసుపత్రులు" మొలుస్తున్నాయి
రోగులకివ్వాల్సిన సూదిమందులు
తెల్లకోటుల జేబుల్లో కరెన్సీని నింపుతున్నాయి
మార్చురీలో శవాల రాకపోకలకు
నోట్ల తోరణాలు కట్టాల్సి వస్తోంది
కొత్త సినిమా టిక్కెట్లకోసం
అభిమానులు క్యూ కట్టినట్టు . .
శ్మశానాల్లో సంస్కారాలకు
శవాలు లైను కడుతున్నాయి.
పార్థివదేహాలు ప్యాకెట్లలో చుట్టబడి
చివరిచూపులు కూడా దక్కడంలేదు
అంత్యక్రియలకూ ఈవెంట్ మేనేజర్లు వచ్చేశారు!
అనుబంధాలు ఆత్మీయతలు నీటిబుడగలయ్యాయి
ప్రాణాలను మానవత్వంతో కాపాడడం పోయి
నోట్లకట్టల త్రాసులో తూకం వేస్తున్నారు!
ప్రకృతి ఇచ్చే ప్రాణవాయువును కాదని
సిలిండర్ల గాలినే పీల్చాలనే చట్టాలొస్తాయేమో!!
చికిత్స చేద్దామని ముందుకొచ్చే ఆనందయ్యలు
చిక్కుల పాలవుతున్నారు
వాట్సప్ వైద్యసలహాల వలయంలో
అసలు వైద్యమేదో అంతుబట్టడంలేదు
పల్లెలకూ పాకుతున్న కమిషన్ల ఎరలతో
కార్పొ"రేట్ల"కు రోగి చిక్కితే పండుగే !!
అడుగడుగునా మెడికల్ ఇన్వెస్టిగేషన్ల మాయ
స్కానింగ్ యంత్రాలలోకి రోగుల్ని నెడుతూ
కమిషన్లు దండుకునే స్టెతస్కోప్ దొరలు !!
కుండల్లో కూడెత్తుకెళ్తున్న కార్పొరేట్ జాగిలాలను
కర్రతోనైనా అదిలించలేని కాపలాదారులు !!
ఎద్దు పుండుకు కాకులు వైద్యంచేస్తే
"ఎద్దుకు తద్దినం – కాకికి భోజనం" అంతే కదా !!
లక్షలకోట్ల బడ్జెట్లు పారుతున్న రాజ్యంలో
ప్రజలకు టీకాలు కూడా దొరకని దైన్యం !!
నా దేశంలో ఇప్పుడు వైద్యాన్ని
వైద్యంలానే చేయించాలంటే
ఆరోగ్యవిప్లవమొకటి రావాలి !!
నెత్తురు నైవేద్యం కోరని ప్రాణదాతలు పుట్టాలి !!!

–శ్రీధర్ కొమ్మోజు
చరవాణి: 9989464467

లంచగొండితనం

అక్రమముగ ఆస్తు లార్జించి, 'అనిశా'కు
దొరకిపోయినట్టి 'దొంగ దొరలు'
భయము చెందబోరు పడబోవు శిక్షల
దలచి, ధన మొసంగు ధైర్య మద్ది!
అనిశా= అవినీతి నిరోధక శాఖ

శిక్ష పడిన పిదప చెరసాలలకు పంప
బడుదు, రైన నేల భయము? చేతి
నిండ ధనము గలిగి యుండినచో లంచ
గొండు లుందు రాదుకొనగ నచట!

ఇందు గల, రందు లేరను
సందేహము వలదు, సర్వ శాఖల
లంచాలందుకొనువార లుందురు
కొందరు సిద్ధముగ, 'మేలు'
గూర్చు సమర్థుల్

లోటు జరుగకుండ లోపాయికారిగా
సర్వ సౌఖ్యము లట సాధ్యపడును;
అందుకొనగవచ్చు నతిథి సత్కారాలు
క్రమము తప్పకుండ, కచ్చితముగ!

బ్రతుక నేర్వనట్టివా రెవ్వరో బయట
పెట్టు వరకు గుట్టు రట్టు కాదు;
గుట్టు బయటపడిన కొంప మునుగదు,
సొమ్మున్న దొడ్డిదారు లుండు నెన్నో!
చెరసాలలందు గల వం
తరములు; ఖైదీలలోన ధనికుల కందున్
నిరతము తగు మర్యాదలు,
నిరసన గళములు ధ్వనించు నిర్భాగ్యులపై!1

సర్వాంతర్యాములుగా
పేర్వడసిన లంచగొండ్లు విస్తృత పరిధిన్
నిర్వర్తింతురు తమ 'విధు'
లోర్వనివా రెన్ని యన్న నులుకక యెపుడున్

కొంతమంది లంచగొండు లిచ్చిన దేదొ
పుచ్చుకొనుట కానవచ్చు; కొంద
రట్టు గాక, పనినిబట్టి తామే నిర్ణ
యించి చెప్పుచుందు 'రింత' యనుచు!

అవసరమ్ము గాన , అడిగిన దెంతైన
ఇచ్చితీరవలయు, నీయకున్న
అన్య మార్గ ముండ, దందున లంచగొం
డులకు పూర్ణ లబ్ధి కలుగుచుండె!

తెలిసియుండి గూడ తెగబడి తప్పులు
చేయువారి నేమి చేయవలయు?
పట్టువడిన, శిక్ష పడిన లంచము లీయ
గలరు, తప్పుకొనను గలరు వారు!

పట్టువడిన గాని, త్వరితగతి విచార
ణమ్ము జరుగబోదు, సత్త నడక
కన్న మందగతిని కొన్నా(న్నే)ళ్లు కొనసాగి,
యెట్లు ముగియ గలదొ యెవ్వ డెరుగు?

కాలయాపనమ్ము లేల విచారణ
లందు, తీర్పులందు, అమలునందు?
కాలయాపనమున చాల అనర్థాలు
జరుగుచుండె, ప్రభుత యెరుగ వలయు!

–హెచ్. ఆర్. చంద్రం
9493248053

నానీలు

ఎన్ని కన్నీటి నదులను
ఒడి చేర్చుకుందో...!
సంద్రంలో నీరు
ఉప్పనయ్యాయి!!

జీవిత సాగర తీరంలో
జ్ఞాపకాల గవ్వలు...!
ఎంత ఏరినా
తరగక!!

సాహితీ సంద్రం
రత్న గర్భ!
శోధించిన వారిని
జ్ఞాన సంపన్నుల చేస్తూ...!!

ప్రతి పున్నమిన
ఏకాంత సేవే...!
కడలి కెరటమై
జాబిల్లిని చేరగ...!!

ఏ వేదన చేరిందో
మనో సంద్రాన్ని!
కన్నీటుప్పెన
తీరం దాట యత్నిస్తుంది!!

–వెగ్గలం ఉషశ్రీ
9440370066





కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

'బుధవారం బాద్షా'

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.
నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

ప్రథమ బహుమతి విజేత

ఆమెప్పుడూ అంతే..

ఆమెప్పుడూ అంతే...
'వెంటాడే నీడలా' వెన్నంటేవుంటూ
ఏ చెడుగాలి దుమారం ముంచెత్తకుండా
అడ్డుతెరగా మారి కాపు కాస్తుంది.
ఆమెప్పుడూ అంతే...
జీవిత పయనంలో
ఎలా నెగ్గుకురావాలో
'ఆత్మీయత నిండిన మనసు' తో
అది గురువై తన అనుభవ పాఠాలను
నా మెదడు పొరల్లోకి
మెల్లగా జొప్పిస్తుంది.
ఆమెప్పుడూ అంతే...
నేను నడిచే దారిలో నమ్మించి వంచించే
మానవ మృగాలుంటాయని హెచ్చరించి
భయ విహ్వల కాకుండా భరోసానిచ్చి
'ధైర్యాన్ని నూరిపోసి'
ధ్వజస్తంభమై నిలుస్తుంది.
ఆమెప్పుడూ అంతే...
సర్వకాల సర్వావస్థలయందు సేవకిలా
మొద్దుబారిన నాలో ఉత్తేజ తరంగానికి
నిలువెల్లా విజయగాథల పరిమళాలు పూసి
'భావావేశమైన ఉక్కు నరాలలో'
అనవసర వ్యర్థాల కుప్పలు పేరుకుపోకుండా
వెచ్చని నెత్తురు ప్రవహించేలా స్ఫూర్తినిచ్చి
భావితరాలకు మార్గదర్శిలా
తీర్చిదిద్దుతుంది.
ఆమెప్పుడూ నాకు హితురాలే
నా మనసెరిగిన స్నేహితురాలే
ఎందుకంటే... ఆమె అమ్మ కదా!

–వాడపర్తి వెంకటరమణ
81795 78895

ద్వితీయ బహుమతి విజేత

నన్ను మలిచిన నాన్న

విసిరికొట్టిన పలక భళ్ళుమని
పగిలినప్పుడు..
నా వీపు పగలగొట్టలేదు నాన్న
పలకముక్కలు శుభ్రంగా ఏరమన్నాడు
ఏరుతూ..యోచించిన
మనసు సిగ్గుపడి శుభ్రపడింది..
స్నేహితుడు పెన్ను లాక్కొని కొట్టినప్పుడు..
నా కోసం తను కొట్లాడలేదు నాన్న
ధైర్యం నూరిపోసినట్లు..వీపు పై తట్టి
నీ పెన్ను అలా వదలక తెచ్చుకోమన్నాడు
తిరిగి తెచ్చుకునేటప్పుడు..
నేనేంటో తెల్సివచ్చింది.
సమాజ అవకతవకలకు
పిడికిలి బిగించినపుడు..
నీకెందుకు సొంత లాభం చూసుకోమనలేదు
నాన్న
నా భావావేశ ఉక్కు నరాలలో
సరైన పంథా చూడమన్నాడు
తోవను గుర్తిస్తూ..
లక్ష్యం గ్రహించినపుడు
గమ్యం గమనింపుకొచ్చింది.
ఆత్మీయత నిండిన నిండు మనసుతో..
నన్ను హత్తుకొన్న నాన్న..
అమ్మతో కలిసి నన్ను ఇలా..
నిలిపిన నాన్న..
నా సమూహపు విజయాన్ని ఆకాంక్షించాడు..
'ఎప్పటికైనా.. ఆకాంక్షలు..స్వప్నాలు..
నెరవేరే తీరుతాయి ..'
నన్ను మలిచిన నాన్న మాటలు
ఆశలతీరాలను తాకుతూ..

–వేదన

'మాట'పై తొలి తెలుగు దీర్ఘకావ్యం రాసిన సుప్రసిద్ధ కవి, సాహితీ సేవాదీప్తి చిన్ని నారాయణరావు గారి సౌజన్యంతో 'మల్లెతీగ' కథల పోటీ నిర్వహిస్తోంది.
చిన్ని నారాయణరావు ఫౌండేషన్ (నెల్లూరు)- **మల్లెతీగ** సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలో తెలుగు రచయితలు, రచయిత్రులందరూ ప్రాంతాలకతీతంగా పాల్గొంటారని ఆశిస్తూ ఆహ్వానం పలుకుతున్నాం.

చిన్ని నారాయణరావు ఫౌండేషన్
మల్లెతీగ సంయుక్త ఆధ్వర్యంలో

కథల పోటీ

మొత్తం బహుమతులు రు.25,000/-లు

మొదటి బహుమతి రు.8,000/-లు
రెండవ బహుమతి రు.5,000/-లు
మూడవ బహుమతి రు.3,000/-లు
రు.1,000/-ల చొప్పున 9 కథలకు ప్రత్యేక బహుమతులు

నిబంధనలు : కథలు రొటీన్‌కు భిన్నంగా సామాజికాంశాల్ని స్పృశిస్తూ, తెలుగువారి జీవితాలకు ప్రతీకలుగా వుండాలి. ఈ పోటీ కోసం ప్రత్యేకంగా రాసిన కథలు మాత్రమే పంపాలి. ఇతర పత్రికల్లో ప్రచురించినవి, పరిశీలనలో వున్నవి పంపవద్దు. కథలు కాగితానికి ఒకవైపే రాయాలి. కథలు రాతప్రతిలో 6 పేజీలు, డీటీపీలో 3 లేక 4 పేజీలకు మించరాదు. యూనికోడ్ ఫాంట్‌లో టైప్ చేసినవారు వర్డ్ ఫైల్‌ని ఈమెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. కథ రాసిన పేపరుపై మీ పేరు గానీ, చిరునామా గానీ రాయకూడదు. విడిగా హామీపత్రం రాసి, ఆ హామీపత్రంలో మీ పేరు, చిరునామా వివరాలు రాయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపబడవు. కథలు పంపే కవరుపై 'మల్లెతీగ కథల పోటీకి' అని స్పష్టంగా రాయాలి.

కథలు అందాల్సిన చివరి తేదీ : 2021 ఆగస్టు 31

చిరునామా : కథలపోటీ, ఎడిటర్, నవమల్లెతీగ మాసపత్రిక, 41-20/3-24, మన్నవవారి వీధి, కృష్ణలంక, విజయవాడ-520 013.
email : malleteega@gmail.com
Contact : 92464 15150, 94402 02942

TURAGA FOUNDATION

తురగా ఫౌండేషన్

బాలచెలిమి పిల్లల పత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో
తురగా జానకీరాణి పిల్లల కథల పోటీలు

పిల్లల కోసం కథలు
చిట్టి కథలు, చిన్ని కథలు

పిల్లలని, పిట్టలని,
కబుర్లని, కథలని ప్రేమించేవారు
ఎవరైనా హాయిగా కథ రాసి
మాకు పంపవచ్చును

మొదటి బహుమతి: 10000 రూపాయలు
రెండో బహుమతి: 7000 రూపాయలు
మూడో బహుమతి: 5000 రూపాయలు
ప్రోత్సాహక బహుమతులు: Rs 2000 X 3

కథలు పంపవలసిన చిరునామా:
turagafoundation2021@gmail.com
or
#29, Journalists' Colony
Road # 3, Banjara Hills
Hyderabad - 500034
Ph: 98484 29169
92461 03119

చివరి తేదీ: జులై 31, 2021

అంశం ఏదైనా మీ ఇష్టం. టైపులో 3 పేజీలు, చేతి రాతలో 5 పేజీలు మించకుండా

ప్రవాహ ప్రవాహం

జీవితం మంచి చెడుల మయం
కనిపించని కాలవాహినిలో
కలిసే దాక సాగే ప్రాణ ప్రవాహం.
కష్టమొచ్చినా నష్టమొచ్చిన
కనికరంలేక, కన్నెత్తి చూడని
ఆగక సాగిపోయే కాలప్రవాహం.
వర్తమానానికి వార్ధక్యం
అంటగట్టే భవిష్యత్తు
గతం వర్తమాన పరిణామ ప్రవాహం.
తాను లేనంటు చోటులేని పవనం
తాను కనిపిం(పెం)చకున్న
బ్రతికించుప్రాణుల దాని ప్రవాహం.
సమస్త సిగ్నల్స్ వ్యవస్థకు మూలం
ఆధునికతకు ప్రాణం
గాలిలోనిఅంతరంగతరంగ ప్రవాహం.
అలల హోరులో ఘోషించే ఉప్పు
సముద్రం దప్పిక తీర్చు నావికునికి
దాని ప్రవాహ ప్రవాహం.
ఉర్విపై ఉరుములు మెరుపులఉత్సాహం
అది ప్రకృతి పులకింతల ప్రవాహం
మహిపై మంచి చెడుల నిర్మాణం
మనిషి మస్తష్కఅంతరంగ ప్రవాహం

– పి.బక్కారెడ్డి
9705315250

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.